ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 15 జూలై 2025



నకరికల్లు ఎస్‌ఎస్సీ కాలనీలో ఆక్రమించేందుకు చదును చేసిన ప్రభుత్వ భూమి

# యథేచ్ఛగా కబ్జా

- ప్రభుత్వ భూములు ప్లాట్లుగా మార్చి విక్రయం
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

## నకరికల్లులో రెచ్చిపోతున్న ముఠా

నకరికల్లు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నకరికల్లులో ప్రభుత్వ భూములను యథేచ్ఛ గా కబ్జా చేస్తున్నారు. ఖాళీ స్థలంలో గుడిసె వేయడం, తరువాత వేరే వారికి ఆ స్థలాన్ని విక్రయించడం ఇక్కడ పరిపాటిగా మారింది. అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారికి సమీపాన ప్రభుత్వ భూములు ఉండడంతో ఆక్రమార్కుల కళ్లు వాటిపై పడ్డాయి. నకరికల్లు - పిడుగురాళ్ల రహదారి సమీపంలోని ఎస్‌ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీలోని ఖాళీ ప్రభుత్వ భూములు, నకరికల్లు - కారంపూడి రహదారిలోని ఎస్‌ఎస్సీ భూములు, నకరికల్లు పోలీస్‌స్టేషన్ ఎదురు ఖరీదైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని.. వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ఈ భూ ఆక్రమణల్లో గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులే ప్రధాన భూమిక పోషిస్తున్నారు. అడ్డగించే ప్రయత్నం చేసిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు భూ ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

### నకిలీ ఇంటి పట్టా

గత ప్రభుత్వ హయాంలో నకరికల్లులో 360 మందికి 2021లో ఇంటి స్థల పట్టాలు జారీ చేశారు. కాగా వాటిలో కొన్ని ఆన్‌లైన్‌లో రిజిష్టర్ కాలేదు. వీటిని గుర్తించిన అక్రమార్కులు వాటికి నకిలీ పట్టాలను సృష్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సంతకాన్ని



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

ఫోర్జరీ చేసి.. ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలంలోకి వెళ్లడంతో నకిలీ పట్టా గుట్టు వెలుగు చూసింది. దీంతో సోమవారం స్థానికులు తహసీల్దార్ పుల్లారావుకు ఫిర్యాదు చేశారు. నాగూర్ అనే వ్యక్తి నకిలీ పట్టా సృష్టించినట్లు ఫిర్యాదు అందిందని తహసీల్దారు తెలిపారు. దీనిపై విచారణ జరిపించి, చర్యలు తీసుకుంటామని ఆయన సమాధానం ఇచ్చారు. నకరికల్లులోని లేఅవుట్ 2లో నకిలీ పట్టాలు గుర్తించినట్లు తెలిపారు.



● ఏరియా పభుత్వ ఆస్పత్రిలో పాడుబెట్టిన ఆక్సిజన్ ప్లాంట్

# నిర్లక్ష్యానికి నిలువుటద్దం!

- ఆస్పత్రుల్లో నిరుపయోగంగా ఆక్సిజన్ తయారీ ప్లాంట్లు
- బయట కొనుగోలుకే వైద్య ఆరోగ్యశాఖ ఆసక్తి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట, సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ తయారీ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. వాటిని వినియోగించకుండా.. ప్రైవేట్ సంస్థల నుంచి ఆక్సిజన్ కొని వైద్య ఆరోగ్యశాఖ అధికారు లు రోగులకు అందిస్తున్నారు. దీంతో దాతల దాతృత్వానికి విలువ లేకుండా పోవడంతో పాటు ప్రభుత్వ నగదు దుబారా అవుతోందని ప్రజలు, రోగుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కోవిడ్ విజృంభించిన సందర్భంలో ఆక్సిజన్ అందక ఎంతోమంది కోవిడ్ బాధితులు మరణించారు. ఆక్సిజన్ లేక ఎవరూ మరణించకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం దాతల సహకారంతో ఈ ఆక్సిజన్ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. నరసరావుపేట ఆస్పత్రిలో కేసీపీ సంస్థ, సత్తెనపల్లిలో దాతల సహకారంతో ప్లాంట్లను నెలకొల్పారు.

నరసరావుపేటలో ఆక్సిజన్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా కొనుగోలు చేసిన ఆక్సిజన్ ఇందులో నింపుతున్నారు. ట్యాంక్ నుంచి ఆక్సిజన్‌ను పైపుల ద్వారా రోగులకు అందిస్తున్నారు. సత్తెనపల్లి ఆసుపత్రికి నరసరావుపేటలో సిలిండర్లకు ఆక్సిజన్ పట్టించి.. తీసుకెళ్తున్నారు. ఇందుకు రూ.లక్షల్లో చెల్లిస్తున్నారు. ప్రభుత్వ నిధుల దుబారాను నిలుపదల చేసి, ఆక్సిజన్ ప్లాంట్‌లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.




## 'మనమిత్ర'తో.. అన్నదాత సుఖీభవ

- అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేదా..?
- మన మిత్ర వాట్సాప్ నంబరుకు హాయ్ పెడితే చాలు..
- ఎందుకు అనర్హులయ్యారో వెంటనే సమాచారం

## అడ్డగోలు.. అనుసంధానం

- విద్యుత్ సర్వీసు ఒకరిది.. ఆధార్ మరొకరిది

8

## ఆరుగురు పిల్లలకు రూ.78 వేలు



6

- 'తల్లికి వందనం'తో.. వైసీపీ సానుభూతిపరుడి మహానందం
- కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

# ఇచ్చే తీరిక లేక!

## వెనక్కి వెళ్లిన స్పౌజ్ పింఛన్ల నగదు

**చేతికందిన ఫలం నోటి దాకా రావడం లేదన్న చందంగా మారింది భాగస్వామ్య పింఛనుదారుల(స్పౌజ్) పరిస్థితి. స్పౌజ్ పింఛన్లకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో భాగస్వామి దూరమైనా.. ప్రభుత్వం నుంచి ఒక భరోసా ఉందని పండుటాకులకు ధీమా లభించింది. అయితే ఆచరణలో లబ్ధిదారులకు ఇంకా ఊరట దక్కలేదు. పింఛను మంజూరై రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు వారికి నగదు జమ కాలేదు. వచ్చిన నిధులు వెనక్కి వెళ్లిపోతూనే ఉన్నాయి.**

- జూన్‌లోనే ఇస్తామని ప్రకటన..
- నిధుల విడుదల పలుమార్లు వాయిదా పడిన
- పంపిణీ ఆవేదనలో లబ్ధిదారులు



● మూడు జిల్లాల్లో 8,304 మందికి..

కూటమి ప్రభుత్వం 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ మధ్య కాలంలో మృతి చెందిన పింఛన్‌దారుల జీవిత భాగస్వాములకు వారి పింఛను పొందే అవకాశాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో కల్పించింది. మే నెలాఖరుకల్లా అర్హులను ఎంపిక చేసి వారికి జూన్ నెల నుంచి పింఛను అందజేస్తామని ప్రకటించింది. దీంతో భాగస్వామి కోటాలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 8,304 మందికి పింఛను పొందే అవకాశం లభించింది. గుంటూరు జిల్లా నుంచి 2,565, బాపట్ల నుంచి 2,715, పల్నాడు నుంచి అత్యధికంగా 3,094 మంది స్పౌజ్ కోటాలో కొత్తగా పింఛను పొందారు.

సత్తెనపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటాలో ఎంపికైనవారికి తొలుత జూన్ 1న పింఛను అందజేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పాటైన జూన్ 12వ తేదీకి పంపిణీని వాయిదా వేసింది. అందుకోసం రూ.3.32 కోట్లు అధికారుల ఖాతాల్లోకి జమయ్యాయి. అయితే అదే రోజున ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పింఛన్ల పంపిణీ మరోమారు నిరవధికంగా వాయిదా పడింది. ఎప్పుడు పంపిణీ చేస్తారనే విషయం చెప్పకుండానే వాయిదా వేయడంతో సందిగ్ధం నెలకొంది. అలా జూన్ నెల మొత్తం గడిచిపోవడంతో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నిధులను తిరిగి జమ చేయాలని ఆదేశించారు. దీంతో నిధులన్నీ తిరుగు టపాలో వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో జూలైలోనైనా పింఛన్లు అందుతాయనుకున్న లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది.ఈ నెలలో ఇప్పటికి 14 రోజులు గడిచిపోయినా.. పింఛన్ల పంపిణీ మాత్రం జరగలేదు. దీంతో మళ్లీ కమిషనరేట్ నుంచి జిల్లా అధికారులకు నగదు తిరిగి వెనక్కి పంపాలని ఆదేశాలు వచ్చాయి. ఫలితంగా ఈ నెల పింఛను నగదు తిరిగి వెనక్కి వెళ్లిపోతోంది. అయితే ఇలా వెనక్కి వెళ్లిన పింఛను మొత్తాన్ని తిరిగి ఒకేసారి అందజేస్తారా? లేక పథకం అమలులోకి రాలేదు కాబట్టి ఈ రెండు నెలలది మినహాయించి ఒక నెల పింఛనుతోనే సరిపెడతారా? అన్న ఆందోళన లబ్ధిదారులను వెంటాడుతోంది.

### కారణాలేంటి..?

పింఛను పంపిణీ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం, భాగస్వామ్య పార్టీలు అట్టహాసంగా నిర్వహించాలని భావించాయి. అయితే వివిధ కారణాలతో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులకు అందుకు అవకాశం లభించ లేదని తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు అందరూ సుపరిపాలన కార్యక్రమంలో తీరిక లేకుండా ఉండడంతో ఈ కార్యక్రమం మరుగున పడిపోయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఈ జాప్యం కారణంగా లబ్ధిదారులకు మాత్రం తీవ్ర నష్టం వాటిల్లింది.

# అర్జీల పరిష్కారంలో.. జాప్యం వద్దు

**- కలెక్టర్ పి.అరుణ్‌బాబు**

నరసరావుపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కర వేదికలో జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి అర్జీలను స్వీకరించారు. మొత్తం 207 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జాప్యానికి తావులేకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

# మ్యాచ్ అయితే.. మార్పు!

- రూ.9 కోట్లకు పైగా నరసరావుపేట ఎంపీ లాడ్స్
- మ్యాచింగ్ గ్రాంట్‌గా 'ఉపాధి' నిధులకు విజ్ఞప్తి
- విడుదలైతే.. నియోజకవర్గంలో అభివృద్ధికి ఆస్కారం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ నిధులు మ్యాచింగ్ గ్రాంట్ కోసం ఎదురు చూస్తున్నాయి. ఉపాధి హామీ పథకం నిధులను అనుసంధానిస్తే.. పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వీటిని ఉపయోగించే అవకాశం ఉంది. పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం(ఎంపీ లాడ్స్) కింద నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు కేంద్రం రూ.9.80 కోట్లు కేటాయించింది. ఇందులో ఇప్పటి వరకు రూ.4,16,758 ఖర్చు అయినట్లు ఎంపీ లాడ్స్ నివేదిక తెలియజేస్తోంది.

### మౌలిక వసతుల కల్పన, ఆస్తుల సృష్టికి..

ఎంపీ లాడ్స్ లక్ష్యం పార్లమెంట్ నియోజకవర్గంలో తాగునీరు, విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం. సమాజ ఆస్తులను సృష్టించే పనులకు ఎంపీ నిధులను సిఫార్సు చేయాలి.



ఏటా రెండు విడతల్లో నిధులు విడుదల చేస్తారు. నిధుల ఖర్చుకు నిర్ణీత కాలపరిమితి లేదు. ఒక ఏడాది విడుదలైన నిధులు తదుపరి ఏడాదిలోనైనా ఖర్చు చేసే వెసులు బాటును కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఎంపీ ప్రజా ఉపయోగార్థం సిఫార్సు చేసిన పనులను నోడల్ జిల్లా అథారిటీ అమలు చేస్తుంది. స్థానిక సమాజం ఆర్థిక వ్యవస్థను మెరుగుపర చడానికి అభివృద్ధి ప్రాజెక్టులను సులభతరం చేయడం, మన్నికైన ఆస్తులను సృష్టించేందుకు ఎంపీ లాడ్స్‌ను వినియోగించాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించింది. ప్రత్తిపాడు మండలంలోని నడింపాలెంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో విద్యుత్ సౌకర్యం మెరుగుపరచడానికి ఎంపీ నిధులను ఖర్చుచేశారు.

### ప్రభుత్వానికి విజ్ఞప్తి..

నిధుల వినియోగంపై ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను వివరణ కోరగా.. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను ఎంపీ లాడ్స్‌కు మ్యాచింగ్ గ్రాంట్‌గా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి కోసం చూస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధి పథకం నిధులు మ్యాచింగ్ గ్రాంట్‌గా విడుదల చేసిన వెంటనే ఎంపీ లాడ్స్‌ను ఖర్చు చేయడం జరుగుతుందన్నారు.



● ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

# త్వరితగతిన అర్జీలకు పరిష్కారం

**- ఎస్పీ కంచి శ్రీనివాసరావు**

నరసరావుపేట లీగల్, జూలై 14, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం తదితర సమస్యలకు సంబంధించి 75 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ పోలీసు అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపేందుకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు. కార్యాలయంలో దూర ప్రాంతాల అర్జీదారులకు భోజన ఏర్పాట్లు చేశారు.

# రోడ్లపై వంటశాలలు..

## చోద్యం చూస్తున్న పురపాలకులు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట రహదారులను వంటశాలలుగా మార్చేసుకున్నారు. రెస్టారెంట్‌లు.. బిర్యానీ పాయింట్‌ల నిర్వాహకులు రోడ్లపైనే వంటలు చేస్తున్నారు. ఇది ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. చర్యలు తీసుకోవాల్సిన మునిసిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో తమను అడిగేదెవరు అన్న రీతిలో వ్యాపారులు రెచ్చిపోతున్నారు. పెద్ద పెద్ద హోటళ్లు నిర్వ హిస్తున్నవారు వంట శాలలను ఏర్పాటు చేసు కోకపోవడం గమనార్హం. వారు ప్రధాన రహదారులను వంటశాలలుగా మార్చుకుని వంటలు చేస్తుండటంతో పొగతో ఆయా ప్రాంతాల్లో పాద చారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సాగు సమయం.. దాటిపోతోంది!

- తొలకరి లేక పత్తి పంటపై ప్రభావం
- గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం
- నెలాఖరు దాటితే.. ప్రత్యామ్నాయం వైపు రైతులు

పిడుగురాళ్ల, మాచర్ల టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వర్షాభావం రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తొలకరి కూడా లేకపోవడంతో పత్తి సాగుపై సందిగ్ధం ఏర్పడింది. పల్నాడు ప్రాంతంలో గతేడాది కన్నా ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి సాగు విస్తీర్ణం సగానికి పైగా తగ్గే అవకాశం ఉంది. పిడుగురాళ్ల వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో 25 వేల హెక్టార్ల పత్తి సాగుకు అవకాశం ఉండగా.. ఇప్పటికి 3 వేల ఎకరాల్లో మాత్రమే రైతులు పత్తి సాగు చేశారు. మాచర్ల వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో గతేడాది జూలైకి 40 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈ ఏడాది 19,360 ఎకరాల్లో మాత్రమే పత్తి సాగు చేశారు. గురజాల, మాచర్ల ప్రాంతాల్లో వ్యవసాయ బోర్లలో కూడా నీరు అడుగంటింది. ఏప్రిల్,



గుత్తికొండ సమీపంలో పత్తి పంట

మే నెలల్లో బోర్ల కింద వేసిన పత్తి పంటకు నీరందక కొన్ని ప్రాంతాల్లో వడబడే దశకు చేరుకుంది.

### నెలాఖరు వరకే...

పల్నాడు ప్రాంతంలో పత్తి సాగు చేసేందుకు జూలై చివరి వారం వరకే అవకాశం ఉంది. ఆ తర్వాత పత్తి సాగు చేస్తే 40 రోజుల్లో అంటే సెప్టెంబరులో గుడ్డి పత్తి కాపుకొచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులు జూలై దాటితే పత్తి సాగు చేసేందుకు వెనుకడుగు వేస్తారు. జూన్, జూలై నెలల్లో తొలకరి జల్లులు, అకాల వర్షాలకు పత్తి సాగు చేస్తే వర్షాలు, చలి మొదలయ్యే సమయానికి ఒకటి, రెండు తీతలు పత్తి తీసే అవకాశం ఉండేది. దీంతో రైతులకు కాస్త దిగుబడి ఆశాజనకంగా వచ్చే అవకాశం ఉంది. ఆగస్టు మొదటి వారంలో పత్తి సాగు చేస్తే వచ్చే నష్టాలు అనుభవం ఉన్న రైతులకు తెలుసు. ఈ నెలాఖరులో పత్తి సాగుకు వాతావరణం అనుకూలించకుంటే ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, కంది సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

### డీలర్లకు నష్టాలు

పల్నాడు ప్రాంతంలో విత్తన డీలర్లు, వ్యాపారులు పలు రకాల పత్తి విత్తనాలను ముందుగానే దిగుమతి చేసుకున్నారు. రూ.లక్షల్లో డిపాజిట్‌లు చెల్లించి కంపెనీల నుంచి ముందుగానే విత్తనాలను తమ గోడౌన్‌లో నిల్వచేసుకున్నారు. ప్రస్తుతం పెట్టుబడి కూడా రానంతగా విత్తన కొనుగోళ్లు లేవనే చెప్పవచ్చు.

# ఆరుగురు పిల్లలకు రూ.78 వేలు

**● 'తల్లికి వందనం'తో.. వైసీపీ సానుభూతిపరుడి మహానందం**

**● కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు**



తమ పిల్లలతో కలిసి ఆనందం వ్యక్తం చేస్తున్న సాములునాయక్, నాగేశ్వరబాయి దంపతులు

మాచర్లటౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం పాపిరెడ్డికుంట తండాకు చెందిన కాండ్లావత్ సాములు నాయక్, నాగేశ్వరబాబు దంపతులకు ఆరుగురు ఆడ పిల్లలు సంతానం. కూటమి ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ. 13 వేల చొప్పున మొత్తం రూ. 78 వేలు తల్లి బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. సాములునాయక్ వైసీపీ సానుభూతిపరుడు. గతంలో గ్రామంలో జలంటీర్‌గా పనిచేశారు. 2024 ఎన్నికల్లో కనీసం టీడీపీకి ఓటు కూడా వేయలేదని, అయినా సరే స్కూళ్లు తెరిచే సమయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎటువంటి పక్షపాతం లేకుండా పార్టీలకు అతీతంగా ఆరుగురు బిడ్డలకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు బ్యాంకు ఖాతాలో జమ చేశారని, కుటుంబమంతా ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్లరూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాపట్ల మండలం ఆసోదివారిపాలెం గ్రామానికి చెందిన దొంతిన ఏడుకొండలురెడ్డి (43) అనే వ్యక్తి బాపట్ల మండలం మద్దిబోయిన వారిపాలెం అడ్డురోడ్డు వద్ద హైవేపై నడుచుకుంటూ వెళుతుండగా చీరాల నుంచి కర్లపాలెం వైపు వెళుతున్న బైక్ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుకొండలురెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు పోలీసులు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## క్వారీ ఆలయ చైర్మన్‌గా శ్రీకాంత్

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జులై14(ఆంధ్రజ్యోతి): క్వారీ బాల కోటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా గోళ్లమూడి శ్రీకాంత్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి సభ్యులుగా అద్దంకి శ్రీనివాసరావు, కొసరాజు బసంత్ బాబు, దగ్గు వెంకటరమణ, బత్తుల రంగారావు, మోదుగల సుబ్బారెడ్డి, మట్టుపల్లి వెంకటేశ్వరరావు, గుంటూరు వీరాస్వామి, మద్దినేని శ్రీనివాసరావు, లగడపాటి కిరణ్ కుమార్, వెలగా గోపీనాథ్, తాటి.శంకర్, జంపని రామారావు, మక్కే రామారావు, ఏమినేని శ్రీనివాసరావును నియమించారు.

# పరామర్శల పేరుతో బెదిరింపు రాజకీయాలు

**● ప్రజలపై దండయాత్ర చేస్తున్న జగన్ ● ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, నరేంద్ర

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు పరామర్శల పేరుతో అరాచకాలు సృష్టిస్తూ, మరికొం త మందిని చంపుతూ ఇదేమిటని ప్రశ్నిస్తే రప్పా రప్పా నరుకుతా మంటూ మాట్లాడటం క్షమించరాని విషయమని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరామర్శల పేరుతో జగన్ రెడ్డి కొంతమంది అల్లరి మూకను పోగుచేసి పరామర్శల అర్థాన్నే మార్చేశారన్నారు. కేవ లం తమ పార్టీ ఉనికిని కాపాడుకోవటానికి ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నారని విమర్శించారు. జగన్‌కు, వైసీపీకి పెద్ద పాలేరునని చెప్పుకునే పేర్ని నాని చీకట్లో ఎందుకు, పట్టపగలే రప్పా రప్పా అనే కార్యక్రమం చేపడతామని ప్రజల్లో భయాందోళనలు కలిగేలాగా దుర్మా ర్గంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభు త్వం రైతులను ఆదుకుంటుంటే.. వైసీపీకి ఏం చేయాలో అర్థంకాక మామిడి పండ్లు రైతుల పరామర్శ యాత్ర పేరుతో రెచ్చగొట్టే కార్య క్రమాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికా రం కోల్పోయిన దగ్గర నుంచి పరామర్శల పేరుతో ప్రజలపై దండ యాత్రలు చేస్తున్నారన్నారు. రైతులను పరామర్శల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు తమ రౌడీ మూకలతో అలజడులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అకాల వర్షాలు, వరదలు వస్తే రైతుల ముఖం చూడని జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోగానే రైతులపై కపట ప్రేమ కురిపిస్తున్నాడన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీస్ కమిషనర్ దగ్గరకు వెళ్లి సోషల్ మీడియాలో వైసీపీ వారిపై కేసులు పెట్టాలని చెప్పడం చూస్తే సిగ్గు పడాల్సి వస్తోందన్నారు. వైసీపీ క్యాంప్ క్లర్క్ సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన స్క్రిప్ట్ మాత్రమే రోజుకొకరు మీడియాలో మాట్లాడటం పరిపాటిగా మారిపోయిందన్నారు. సింగయ్య మృతి కేసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరు చార్జి షీట్లో నెంబర్ వన్ పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దాసరి రాజామాష్టారు, కంచర్ల శివరామయ్య, బొబ్బిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్న క్యాంటీన్

**ఎమ్మెల్యే ఆనందబాబు**



అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు అన్న క్యాంటీన్ నిర్మాణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రం భట్టిప్రోలులోని బౌద్ధస్థూపం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 42 సంవత్సరాల క్రితం టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు పేదల ఆకలి తీర్చేందుకు కిలో బియ్యం రూ.2 లకే పథకం ప్రవేశపెట్టారని గుర్తుచే శారు. ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రి కూడా ఆదర్శంగా తీసుకుని అమలు చేశారన్నారు. జనతా వస్త్రాల పేరుతో వస్త్ర పంపిణీ కార్యక్రమానికి సైతం ఆయనే శ్రీకారం చుట్టారన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నగర, పట్టణ ప్రాంతాల్లో పేదలు, కూలీల కడుపు నింపేందుకు 219 అన్న క్యాంటీన్‌లు ప్రారంభం చేయడం జరిగిందన్నారు. అవి ఎంతో ప్రజాదరణ పొందాయన్నారు. కేవలం రూ.5లకే రుచి, శుచి కలిగిన అల్పాహారం, నాణ్యమైన భోజనం అన్న క్యాంటీన్ ద్వారా అందించి పేదల ఆకలి తీర్చారన్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి అన్న క్యాంటీన్ నిర్మాణం పూర్తి చేసి పేదలకు అందు బాటులోకి తీసుకు రానున్నట్లు ఎమ్మెల్యే ఆనంద్‌బాబు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, బుచ్చి రాంప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ గొ ట్టిపాటి పూర్ణకుమారి, జడ్పీటీసీ ఉదయభాస్కరి, తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# జన సైనికుల సహనాన్ని పరీక్షించవద్దు

**● జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె హెచ్చరిక**




సమావేశంలో మాట్లడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నాని అహంకారంతో సీఎం, డిప్యూటీ సీఎంపై అవాకులు చెవాకులు పేలుతున్నారని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. పేర్ని నానికి జనసేన తరఫున ఇదే చివరి హెచ్చరికని, భవిష్యత్తులో మరోసారి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సోమవారం అమరావతి రోడ్డులోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లా డారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేస్తూ, మరో పక్కన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తోందన్నారు. వైసీపీ నాయ కులు ఇది తట్టుకోలేక రాష్ట్రంలో అలజడులు సృష్టించే ప్రయ త్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గోడౌన్లో రేషన్ బియ్యం పట్టివేతకు సంబంధించి కేసులో పేర్ని నాని ఉన్నారని, తన ఇంట్లో వాళ్ళను కూడా ఆయన అవినీతిలో భాగస్వా మ్యం చేశారని గాదె ఎద్దేవా చేశారు. నాడు సీఎం చంద్రబాబు వారి ఇంట్లో వాళ్ల జోలికి వద్దని చెప్పడంతో ప్రెస్ మీట్ పెట్టి మరి ముఖ్యమంత్రిని పొగిడిన పేర్ని నాని.. ఇప్పుడు అదే ముఖ్యమంత్రిపై అసందర్భ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శిం చారు. ముఖ్యమంత్రి ముసలి వ్యక్తి అని, ఇంకెన్ని రోజులు ఉంటారని పిచ్చి వాగుడు వాడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని రాష్ట్రానికి ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ య ర్రంశెట్టి పద్మావతి, నాయకులు అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లిక, చట్టాల త్రినాథ్, కాటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు

## లక్నోలో శిక్షణ తరగతులకు మక్కెన

**● రాష్ట్రంలోని డీసీసీబీ చైర్మన్‌లతో కలిసి పర్యటన**



లక్నో పర్యటనలో ఆప్కాబ్ చైర్మన్ వీరాంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఉత్తరప్రదేశ్‌లోని లక్నో పర్యటనకు వెళ్లారు. పరిపాలనా, నాయకత్వం, సహకార విభాగంలో అభివృద్ధి వంటి అంశాలపై మూడు రోజుల పాటు జరుగనున్న శిక్షణ తరగతులకు ఆయన రాష్ట్రంలో డీసీసీబీ చైర్మన్లతో కలిసి హాజరయ్యారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, డీసీసీబీ చైర్మన్, ఇద్దరు సీనియర్ అధికారులు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులకు హాజరుకానున్నారు.

## రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, జులై 14, (ఆంధ్రజ్యోతి), శావల్యాపురం వెల్లల చెరువు రైల్వే స్టేషన్ మధ్య రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. నర్సరావుపేట రైల్వే ఎస్ఐ తెలిపిన వివరాలు.. రైలు నుంచి జారిపడి బలమైన గాయాలు తగిలి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది న ట్లు ఆయన తెలిపారు. మృతుడు ఎరుపు రంగు చొక్కా, సిమెంట్ రం గు స్వెట్టర్, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి, మెడలో ఏసుక్రీస్తు శి లువగల దండ ధరించి ఉన్నాడన్నారు. మృతుని వివరాలు తెలిసి న వారు నరసరావుపేట రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. మృత దేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు.

## ఘర్షణలో ఇద్దరికి కత్తిపోట్లు

**వెదురు బొంగులు దగ్ధంపై వాగ్వాదం**

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూలై14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేజెండ్ల గ్రామంలో పంట పొలాల్లో వెదురు బొంగులు తగలబడిన ఘటనకు సంబంధించి చెలరేగిన వివాదంలో ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. చేబ్రోలు పోలీసులు, స్థానికులు కథనం ప్రకారం వేజెండ్ల గ్రామంలో తూమాటి సుమన్ అనే వ్యక్తి పొలంలో వెదురుబొంగులు తగలబడ్డాయి. గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద గ్రామస్తులతో ఈ విషయం చర్చిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి.. బొంగులు తగలబడటానికి తానే కారణమని ఊర్లో ప్రచారం చేస్తున్నావంటూ సుమన్‌తో ఘర్షణకు దిగాడు. అంతేకాకుండా.. వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశారు. దుర్గా ప్రసాద్ దాడిలో సుమన్ మోచేతికి నడుము భాగానికి కత్తిపోట్లకు గురయ్యాడు. దీంతో సుమన్ బంధువైన తోమాటి పృథ్వి సుమన్‌ను రక్షించే ప్రయత్నంలో కత్తిపోట్లుకు గురయ్యాడు. స్థానికులు కేకలు వేయగా దుర్గా ప్రసాద్ అక్కడ నుంచి పారిపోయాడు. స్థానికులు ఆటోలో వడ్లమూడిలోని ప్రైవేటు ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్సైడి వెంకట కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## అంతర సాగుతో పత్తిలో నష్ట నివారణ

**ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త వెంకట రాములు**

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా సాగయ్యే పత్తి పంటలో నష్టాల నివారణకు అంతర పంటల సాగు చక్కని పరిష్కారం అని లాం ఫాం ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు పత్తి పంటను తీవ్రంగా దెబ్బతీస్తాయని, తద్వారా రైతులు నష్టాల్లోకి వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటువంటి పరిస్థితులు ఎదుర్కోవాలంటే అంతర పంటల సాగు మాత్రమే మంచి పరిష్కారం అని పేర్కొన్నారు. పత్తిలో పప్పు జాతి పంటలను సాగు చేస్తే నేలలో సారం పెరిగి ప్రధాన పంట పెరుగుదలలో దోహదపడుతుందని అన్నారు. ఈ అంతర పంటలు చీడపీడలను ఆకర్షించి ప్రధాన పంటకు నష్టం వాటిల్లకుండా కాపాడతాయని తెలిపారు. అంతర సాగుకు అనువైన పంటలను వివరించారు. కంది, సోయా బీన్, పెసర, మినుము పంటలను కూడా సాగు చేసుకోవచ్చునన్నారు. రైతులు అనుమానాల నివృత్తి కోసం ఏరువాక కేంద్రంలో సంప్రదించవచ్చునని కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకట లక్ష్మీ సూచించారు.

## 22 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు

**అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా**



జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): గడచిన 22 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డెక్కారు. సోమవారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇచ్చేదే అతి తక్కువ జీతం అది కూడా అన్ని నెలలు పాటు నిలిపివేయడం ఏమిటని ప్రశ్నించారు. జీతాలు రాక, అనారోగ్యంతో పిడమర్తి పవన్ కుమార్ మృతి చెందారని ఆరోపించారు. అయినా కూడా జిల్లా పరిషత్ అధికారులకు తమ మీద కనికరం కలగడం లేదని ఆవేదన చెందారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపునకు సంబంధించిన బడ్జెట్‌కు పాలక వర్గం ఎప్పుడో అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. అయినా జడ్పీ అధికారులు లేని పోనీ కుంటి సాకులు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటానికి మద్దతుగా వచ్చిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగర అధ్యక్షుడు మందా ప్రేమానందం మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇన్ని రోజులుగా జీతాలు చెల్లించక పోవడం అంటే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద శిక్షకు పాత్రులేనని స్పష్టం చేశారు. జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న సీఈఓ, డిప్యూటీ సీఈఓ మీద చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న వైసీపీ

**● మంత్రి అనగాని సత్యప్రసాద్**



మంచికలపూడిలో మహిళకు కరపత్రం పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

దుగ్గిరాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రప్పా.. రప్పా నరుకుతామని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వైసీపీకి భవిష్యత్‌లో ఉనికి కూడా లేకుండా తుడిచిపెట్టుకుపోతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంపై కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ, వైసీపీ అరాచకాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని, మంత్రి నారా లోకేశ్ కృషితోనే పెద్ద ఎత్తున పరిశ్రమలు రాష్ట్రానికి తరలివస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో సూపర్‌సిక్స్ పథకాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి అనగానికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, గూడూరు వెంకట్రావు, తమ్మిశెట్టి జానకీదేవి, మరీదు రాము, ఏమినేని కోటేశ్వరరావు, యార్లగడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్ణచందుకు 'సాహితీసింధు' పురస్కారం



సాహితీసింధు పురస్కారం అందుకుంటున్న డాక్టర్ జీవీ పూర్ణచందు

నరసరావుపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి) : నరసరావుపేటలో 13వ తేదీ నుంచి 3 రోజులపాటు జరుగుతున్న విద్వత్ సభలలో సోమవారం 2వరోజు కార్యక్రమంలో ప్రసిద్ధ సాహితీవేత్త, పరిశోధకులు, భాషోద్యమ ప్రముఖులు డాక్టర్‌జీవీ పూర్ణచందుని 'సాహితీసింధు' బిరుదుతో సత్కరించారు. 150 గ్రంథాలు రచించి తెలుగు భాషకు తెలుగు సంస్కృతికి వారు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందిస్తున్నట్లు పలువురు వక్తలు తెలిపారు. ప్రసిద్ధ పంచాంగ కర్తలు బుర్రా వెంకటేశ్వర శర్మ, బుట్టే వీరభద్ర దైవజ్ఞ, ఇంద్రకంటి ప్రసాదశర్మ సిద్ధాంతి, చల్లా శ్రీనివాస శర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రపతి బహుమతి గ్రహీత డాక్టర్ పీటీజీవీ రంగాచార్యులు సభను నిర్వహించారు.

## ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

పెదకాకాని, జూలై 14(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పెదకాకాని పోలీసులు సోమవారం తెలిపారు. వెనిగండ్ల గ్రామానికి చెందిన ఇంటూరి కిరణ్, సునీల్ బాషాతో పాటు గుంటూరు ఇజ్రాయెల్ పేటకు చెందిన సయ్యద్ బాషా అనే ముగ్గురు కొంతకాలంగా గంజాయి అమ్ముతున్నారు. గత రాత్రి ఆటోనగర్ వై జంక్షన్ వద్ద గంజాయి ప్యాకెట్లు కడుతున్న వీరిని అందుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 1.30 గ్రాముల గంజాయిని స్వాధీన చేసుకున్నారు. ముగ్గురినీ కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

**అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 98, 107, 118 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 190.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 200.00 |

## 53,846 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 56,583 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,846 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 5,945 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | | ఆర్మూరు | 9600 | 10800 |
| 334 | 9500 | 13000 | **ఏసీ కామన్ వెరైటీ** | | |
| నెంబరు. 5 | 10000 | 13300 | 334 | 9500 | 12600 |
| 273 | ---- | ----- | నెంబరు. 5 | 10000 | 13500 |
| 341 | 10000 | 13400 | 273 | --- | ---- |
| 4884 | --- | ---- | 341 | 10000 | 13500 |
| సూపర్ 10 | ---- | --- | 4884 | --- | --- |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | | **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 10000 | 13500 | తేజ | 10000 | 13400 |
| షార్క్-1 | --- | --- | బ్యాడిగి | 10000 | 12600 |
| బ్యాడిగి | 10000 | 12400 | దేవనూరు డీలక్స్ | 10000 | 12500 |
| దేవనూరు డీలక్స్ | 10000 | 12400 | తాలుకాయలు | 4800 | 7000 |

### 17న దేవాలయ భూముల వేలం

రెంటచింతల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల శ్రీలక్ష్మీ చెన్న కేశవ స్వామి, మిట్టగుడిపాడులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన మెట్ట, మాగాణి భూములకు ఈనెల 17న వేలం నిర్వహిస్తామని ఈవో గాదె రామిరెడ్డి చెప్పారు. రెంటచింతల శివాలయంలో ఈ వేలం నిర్వహిస్తామన్నారు. రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలని చెప్పారు.

### ఎరువులకు కొరత లేదు..

సత్తెనపల్లి జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువులకు లోటులేదని ఏవో సుబ్బారెడ్డి అన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధికలాభాలు పొందాలన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకూ సరైన వర్షపాతం లేనందున రైతులు పంటలు సాగుచేయలేదన్నారు. మండలంలో రైతులకు సరిపడా యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

### మార్కెట్ కమిటీ సభ్యులకు సన్మానం

పిడుగురాళ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల నందమూరి తారక రామారావు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యులను సోమవారం టీడీపీ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ వీరస్వామి, వైస్‌చైర్మన్ షేక్ మీరాసాహెబ్, డైరెక్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అమీర్‌అలి, బాబావలి, కారు సైదా, దూదేకుల ఖాశింసైదాతో పాటు పలువురు పాల్గొన్నారు.

### ఖబరస్తాన్‌లో షెడ్డు నిర్మాణానికి సాయం

పిడుగురాళ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణ ముస్లిం ఖబరస్తాన్‌లో రేకుల షెడ్డు ఏర్పాటుకు రూ. 40 వేలను పట్టణానికి చెందిన ఎస్‌ఐ జిలాని సాయమందించారు. ముస్లిం యూత్‌కు తానెప్పుడూ అండగా వుండి సేవా కార్యక్రమాలకు తనవంతు సాయమందించేందుకు తమ కుటుంబం ముందుంటుందని జిలాని తండ్రి అంజాసాహెబ్ తెలిపారు.

### పేర్ని నానీ నోరు అదుపులో పెట్టుకో...

సత్తెనపల్లి జూలై 14(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నానీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విమర్శించే అర్హతలేదని పల్నాడు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సయ్యద్ పెదకరిముల్లా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఎన్నికలలో ఓడించినా నానీకి బుద్ధి రాలేదన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చంద్రబాబుకు నాని క్షమాపణ చెప్పాలని అన్నారు.

### గ్రీవెన్స్‌లో మూడు దరఖాస్తులు

ముప్పాళ్ళ, జూలై 14(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నగేష్ తెలిపారు. సర్వే కొరకు ఒకరు, పాసుపుస్తకం కొరకు మరొకరు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 15.65 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 4600, లీకుల ద్వారా 400, మొత్తం 5000 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలౌతోంది.

## కన్నాకు గొల్లపల్లి సన్మానం



ఎమ్మెల్యే కన్నాను సన్మానిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు

సత్తెనపల్లి జూలై 14(ఆంధ్రజ్యోతి): టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన గొల్లపల్లి వీరాంజనేయులు సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను ఆయన కార్యాలయంలో సన్మానించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కన్నా నమ్మకాన్ని వమ్ముచేయకుండా నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఫెడరేషన్ అభివృద్ధికి కృషిచేస్తానని వీరాంజనేయులు తెలిపారు. ఆయన వెంట ఫెడరేషన్ కార్యకర్తలు ఉన్నారు.

### సుపరిపాలన కార్యక్రమం

అచ్చంపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని 52వ బూత్‌లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం సోమవారం జరిగింది ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, వెనిగళ్ళ కోటయ్య, తిరువాయిపాటి అంజనేయులు, సందెపోగు గాంధీ, కోట చంటి, పుసులూరి ఏడుకొండలు, సందెపోగు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### విగ్రహాల ఏర్పాటుపై విచారణ

ముప్పాళ్ళ, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌కు ముందు ఆర్ అండ్ బీ స్థలంలో ఈనెల 15వ తేదీన ఎస్సీ నాయకులు తలపెట్టిన జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు అనుమతులపై అధికారులు విచారణ చేపట్టారు. ఆర్ అండ్ బీ ఏఈ జగదీష్ సోమవారం విగ్రహాలు ఏర్పాటుచేస్తున్న స్థలాన్ని పరిశీలించారు. జిల్లా కమిటీ అనుమతులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. కాగా మండల ఎస్సీ మోర్చ నాయకుడు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రుద్రబాటి రామారావు విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు లేవని, మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌కు ముందు విగ్రహాలు ఏర్పాటుచేయడం వలన వేలంలో షాపులు ఎవరూ తీసుకోవడం లేదన్నారు. దీంతో మండల పరిషత్ కార్యాలయం నెలకు రూ.7500 ఆదాయం కోల్పోతుందని వివరిస్తూ సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కలెక్టర్, మండల అధికారులకు లేఖలు రాశామని రామారావు తెలిపారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



కరపత్రాన్ని గ్రామస్తులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పలపాడు, లక్ష్మీపురం తండాలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ఏడాదిలో ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత లక్ష్మీపురం తండాలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, ఉప్పలపాడులో హస్పటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు రాయితీపై పశు దాణా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు అంచుల నరసింహారావు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట నరసయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకట కోటయ్య, నాయకులు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, మొరసా శ్రీను, సులగా వెంకట అప్పారావు, దుడ్డు అప్పారావు, యమార్తి శ్రీను, బాబునాయక్, కస్తాల దాసు తదితరులు ఉన్నారు.

### 15 రకాల ఉద్యాన పంటలు రాయితీ ద్వారా ఇస్తున్నాం

ఎన్డీఏ ప్రభుత్వంలో దాదాపు 15 రకాల ఉద్యాన పంటలు రాయితీ ద్వారా రైతులకు అందజేస్తున్నామని మ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని గణపవరం గ్రామంలో జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్, సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిధిగా హజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ వెంకటరావు, షేక్ నబీ రసూల్ ఏవో వెంకట నరసయ్య, సిబ్బంది నవీన్, రమేష్ తదితరులు ఉన్నారు.



అచ్చంపేట: దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు

## ఎరువుల, విత్తనాల షాపుల తనిఖీ

● రూ. 67 వేల విలువైన ఎరువుల సీజ్

రాజుపాలెం, జూలై14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో ఉన్న బాలాజీ ఎంటర్ ప్రైజెస్ షాపులో సోమవారం గుంటూరు వ్యవసాయ కమీషనర్ కార్యాలయం నుంచి వచ్చిన విజిలెన్స్ సిఐ ఎస్ ఎస్ ఎస్ అపర్ణ, ఏడిఏ కన్నయ్యలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో స్టాక్ రిజిస్టర్‌కు భౌతిక నిల్వలకు తేడా, ఫారం ఓ లేకుండా అమ్మకాలు జరపటం, ఈపోస్ మిషన్‌లో నమోదు చేయకపోవటం తదితర కారణాలతో 56 బస్తాలు, రూ 66,770 విలువ కల్గిన ఎరువులను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేవారు. అదే విధంగా ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేనంటువంటి రూ 58,962 విలువ కల్గిన పురుగు మందులను అమ్మకాలు నిలుపుదల చేస్తూ స్టాప్ సెల్ ఇచ్చారు. వారి వెంట స్థానిక ఏవో వెంకటనరసయ్య అచ్చంపేట ఏవో వెంకటేష్ ఉన్నారు.

### అచ్చంపేటలో..

అచ్చంపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను కమిషనర్ కార్యాలయ వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు, ప్రత్యేక బృందాలు తనిఖీ నిర్వహించాయి. రికార్డులు, నిల్వలను పరిశీలించారు. అనుమతి పత్రాలు లేకుండా అమ్మకాలు జరుపకూడదని, రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అనుమానం కలిగిన ప్రతి పురుగు మందు నాణ్యతను పరిశీలించేందుకు పంపించాలని స్థానిక వ్యవసాయ అధికారులకు సూచించారు. తనిఖీలలో ఏడీఏ ఎ. కన్నయ, విజిలెన్స్ సీఐ అపర్ణ, ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జెండా మోసిన కార్యకర్తలను గౌరవించేలా యరపతినేని ప్రణాళిక

● గ్రామాల్లోకి వెళ్లి పలకరింపు ● తగిన ఆర్థిక సహాయం అందజేత



కామేపల్లికి చెందిన వృద్ధ దంపతులు బీసిపోగు ఏసు, దానమ్మలను పలకరిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): నేటి రాజకీయాలంటే ఓటు వేసే వరకే పలకరింపులు....పరామర్శలు. ఆ తరువాత అంటీ అంటనట్లుగా వుండే నేతలకు భిన్నంగా గురజాలలో గత 30 ఏళ్లుగా తనతో కలిసి ప్రయాణం చేసినవారికి యరపతినేని నేనున్నాననే భరోసా కల్పిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ తన గెలుపునకు కృషి చేసిన వారిలో ప్రస్తుతం కొందరు అనారోగ్యం, వృద్దాప్యంతో ఇంటిపట్టునే వుంటున్న కొందరికి సరైన పోషణ జరుగటం లేదన్న విషయాన్ని ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి వచ్చింది. ఇందులో భాగంగా గత వారం పిన్నెల్లిలో పెదపుల్లయ్య అనే 80 ఏళ్ల వృద్దుడిని యరపతినేని పలకరించడమే కాకుండా తరువాత తనవంతు ఆర్థిక సాయంగా కొంత మొత్తాన్ని నిఖిల్ ద్వారా అందించారు. గత రెండు రోజుల క్రితం కామేపల్లి గ్రామంలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎస్సీ కాలనీకి చెందిన బీసిపోగు ఏసు, దానమ్మలను యరపతినేని పలకరించగా ఏసు పక్షవాతంతో బాధపడుతున్నాడని తెలుసుకొని తనవంతు సాయమందిస్తా ధైర్యంగా ఉండాలంటూ భరోసా ఇచ్చాడు.

### కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోండి..

కారంపూడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో పోట్ల నరసింహారావు కోరారు. సోమవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కారంపూడి మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి 1711 కౌలు కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికి 282 మాత్రమే ఇచ్చామన్నారు. కౌలు కార్డులు కావాల్సిన రైతులు భూమి యజమాని ఆధార్, పొలం పాసుపుస్తకం, కౌలుదారుని ఆధార్ కార్డు నకలు, పాస్‌పోర్టు సైజు ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### ఒకరోజు శాస్త్రవేత్తకు హేమంత్‌సాయిరెడ్డి ఎంపిక



హేమంత్‌సాయిరెడ్డి

పెద్దకూరపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 75త్యాళ్ళూరు జడ్పీహైస్కూల్ పదో తరగతి విద్యార్థి కె.హేమంత్ సాయిరెడ్డి జాతీయస్థాయిలో జరిగే ఒకరోజు శాస్త్రవేత్త కార్యక్రమానికి ఎంపికైనట్లు హెచ్ఎం ఎ.శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. అంతర్జాలంలో నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థి ప్రతిభ ఆధారంగా ఈ ఎంపికజరిగినట్లు తెలిపారు. జిగ్నాస ప్రోగ్రాంలో భాగంగా దేశంలో సీఎస్ఐఆర్ 37 అంతర్జాతీయస్థాయి ప్రసిద్ధిచెందిన పరిశోధన సంస్థల్లోని ఒక సంస్థలో ఈ విద్యార్థి వన్‌డే సైంటిస్ట్‌గా గడుపుతాడన్నారు. శాస్త్రవేత్తలతో కలిసి పనిచేయడం, వారికి సహాయకులుగా ఉంటారని వివరించారు. వారితో మాట్లాడడం, ప్రయోగాలు, ప్రయోగశాల పర్యటన తదతర అంశాలపై అనుభవం పొందడం, ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలతో మమేకమయ్యే అవకాశం ఉంటుందన్నారు. సాయికుమార్ రెడ్డి హైదరాబాదులోని సీఎస్ఐఆర్ పరిశోధనా సంస్థలో ఈనెల 21న పాల్గొంటారన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించండి

ఎస్ఎస్‌జీ బృందం



దుర్గిలో ఎస్ఎస్‌జీ బృందం

దుర్గి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎస్ఎస్‌జీ బృందం పేర్కొంది. సోమవారం మండల కేంద్రమైన దుర్గిలో బృందం పర్యటించింది. జిల్లా పరిషత్ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ పంచాయతీ, తడి పొడి చెత్తను వేరుచేసే కేంద్రాలను సందర్శించారు. శానిటేషన్, పరిసరాల పరిశుభ్రత, వాటర్ స్కీమ్స్, పిల్లల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. కొన్ని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సూచనలిచ్చారు. నివేదికలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎం, డిడబ్ల్యూఎస్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ రమేష్, ఎస్ఎస్‌జీ టీం సభ్యులు, ఎంపీడీవో శివప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో సత్యప్రసాద్, తడి, పొడి చెత్త కేంద్రం మండల కోఆర్డినేటర్ బెంజిమెన్, డాక్టర్ పెద సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● సుపరిపాలనలో తొలి అడుగులో యరపతినేని నిఖిల్



ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న యరపతినేని నిఖిల్

మాచవరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని యరపతినేని నిఖిల్ అన్నారు. సోమవారం మాచవరం మండలంలోని తురకాపాలెంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగులో పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. తల్లికి వందనం, పింఛన్ల పెంపుదల, ఉచిత గ్యాస్ సిలిండర్లు తదితర సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిఖిల్ పేర్కొన్నారు. మహిళలతో మాట్లాడుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ మాబు వలి, తెలుగుయువత మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, మండల కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు, యామని రామారావు, యడ్లపల్లి రామారావు, దున్నా చెన్నయ్యచౌదరి, కృష్ణమూర్తి, నరసింహారావు, పుట్లూరి రామయ్య, పిల్లుట్ల సర్పంచ్ లఘుమవరపు శివపార్వతి సాంబశివరావు, కొత్తపాలెం సర్పంచ్ జి రామారావు తదితరులు పాల్గొన్నారు.



దేవాళమ్మ చెరువు

## దేవాళమ్మ చెరువుకు మహర్దశ

● రూ.6.60 కోట్ల నిధుల మంజూరు
● అమృత్ పథకం కింద అభివృద్ధి చేయనున్న ప్రభుత్వం

మాచర్లటౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ ప్రాంతాల్లో చెరువులను అభివృద్ధి చేసేందుకు అమృత్ 2.0 పథకం కింద నిధులు మంజూరుచేస్తోంది. దీనిలో భాగంగా మాచర్ల పట్టణంలోని పూర్వకాలం నుంచి పట్టణ ప్రజలకు మంచినీటి అందిస్తున్న దేవాళమ్మ చెరువు అభివృద్ధికి నోచుకోనుంది. రూ.6.60 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి నిధులు కూడా మంజూరు చేశారు. పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఈ నిధులు విడుదల కానున్నాయి. చెరువులు అభివృద్ధి పరిస్తే గ్రౌండ్ వాటర్ పెరిగి భూగర్భ జాలాలు బోర్లకు పుష్కళంగా అందనున్నాయి.

#### అధునాతన హంగులు..

దేవాళమ్మ చెరువు కాలక్రమంలో ఆక్రమణకు గురై రూపురేఖలు కోల్పోయింది. ఈ తరుణంలో అమృత్ పథకం ద్వారా విడుదలైన నిధులతో అధునాతన హంగులు సంతరించుకోనున్నాయి. చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగించడం, పూడిక తీయడం, కట్టలను పటిష్ట పరచడం, కట్టలకు రాళ్లలో రివిట్‌మెంట్ నిర్మాణం, పెన్సింగ్ ఏర్పాటు జరుగనుంది. అలాగే బండ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్, లైటింగ్, గ్రీనరీ, గ్రిల్స్ వంటి అధునాతన వసతులు సమకూర్చనున్నారు. పట్టణ ప్రజలు సేద తీరేందుకు కుర్చీలు, బెంచీల వంటివి కూడా ఏర్పాటు చేయనున్నారు.

#### సర్వే పూర్తి...

దేవాళమ్మ చెరువు బౌండరీలను పురపాలక సంఘ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటుచేశారు. గతంలో ప్రభుత్వ అవసరాల కోసం కొంత స్థలం కేటాయించారు. అవి పోను మిగిలిన భూమిని అన్యాక్రాంతం కాకుండా భవిష్యత్ తరాల కోసం అభివృద్ధి చేయనున్నారు. అమృత్ 2.0 పథకం ద్వారా ఈ నెలలో టెండర్లు కూడా పిలిచేందుకు పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ రంగం సిద్ధం చేసింది. దేవాళమ్మ చెరువు అభివృద్ధి జరిగితే మాచర్ల పట్టణం మరింత శోభను సంతరించుకోనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

## అభివృద్ధిపై మాట్లాడాలంటే సిగ్గుండాలి

● నోరు అదుపులో పెట్టుకోకపోతే భారీ మూల్యం తప్పదు
● మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిపై కూటమి నేతలు ధ్వజం

గురజాలటౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి అర్థం తెలియని మనిషి ఈ రోజు అభివృద్ధిపై మాట్లాడడానికి సిగ్గు ఉండాలని, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై గురజాల కూటమి నేతలు మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, కాసు మహేష్ రెడ్డి, వారి నాయకులు నోరు అదుపులో పెట్టుకోకపోతే భార్య మూల్యం తప్పదని కూటమి నేతలు హెచ్చరించారు. మా నాయకుడు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వైసీపీ నేతలు రెచ్చగొట్టినా రెచ్చిపోవద్దని, కూటమి ప్రభుత్వానికి లా అండ్ ఆర్డర్ ముఖ్యమని చెప్పడంతో కూటమి నాయకులం సంయమనం పాటిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అరాచకాలు సృష్టించి వీరంగం చేసిన వైసీపీ పార్టీని, వారి నేతలను రాష్ట్ర ప్రజలు ఇంటికి తరిమికొట్టినా ఇంకా వైసీపీ నేతలకు సిగ్గు రావడం లేదని వైసీపీ నేతలుపై కూటమి నేతలు మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికలలో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్న మాటపై నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు కటికం అంకారావు, అడపా శ్రీనివాసరావు, నేలవల్లి బొల్లయ్య, చాగంటి శ్రీను, కొట్టే శ్రీను, పోటు నాగేశ్వరరావు, బడిదెల శ్రీనివాసరావు, శరమాల హనుమంతురావు, చింతకాయల కళ్యాన్, కత్తి చలమరాజు, నెల్లూరి మల్లయ్య, కత్తి రవి, కూటమి నేతలు పాల్గొన్నారు.

### బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

రెంటచింతల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఎస్‌టీయూ జిల్లా కౌన్సిల్ మెంబర్ లేళ్ల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని బడులకు కొత్తగా హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు,సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, క్లస్టర్ ఉపాధ్యాయులను భర్తీ చేశారని, నూతనంగా సృష్టించిన ఉపాధ్యాయ పోస్టుల్లో నియమించిన వారికి ఐడీ నెంబర్లు ఇచ్చి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

### వ్యభిచారం కేసులో ఐదుగురు అరెస్టు

మాచర్లటౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణం రింగురోడ్డు సెంటర్లో ఓ రెస్టారెంట్‌లో వ్యభిచారం నిర్వహిస్తుండగా పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి రైడింగ్ చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టణ ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలు ప్రకారం.. పట్టణానికి చెందిన ఎస్‌కే జానీబాషా, షరాబు, వెంకటహనుమంతు, గోపి, కంభంపాటి అమరేంద్ర, టి.దిలీప్‌లు రింగురోడ్డు సెంటర్లోని ఓ ఫ్యామిలీ రెస్టారెంట్ పైభాగంలో రూం అద్దెకుతీసుకొని ఓ మహిళతో వ్యభిచారానికి పాల్పడుతుండగా దాడిచేసి పట్టుకున్నారు. నిందితులను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదుచేసి స్టేషన్ బెయిల్‌పై విడుదలచేసినట్లు తెలిపారు.

### బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన హైదరాబాద్ కాపురస్తుడు వి.యస్.ఆర్.ప్రసాద్, S/o.మధుసూధన రావు గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి వడకాపురపు శ్రీనివాసరావు గారు సర్వ సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచున్న ఆస్తిని, సదరు ఆస్తిని 1) సజ్జా భవానీ శంకర రావు గారి తరపున విక్రయ ఎగ్రిమెంటుతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజంట్ కొప్పినేని శ్రీనివాస రావు గారి వద్ద నుండి ది.26-12-2014న విక్రయ దస్తావేజు నెం.8355/2014 యస్.ఆర్.ఓ. సత్తెనపల్లి ద్వారా రిజిస్టరు కాబడిన, 2)జంపని లలితమ్మ గారి తరపున విక్రయ ఎగ్రిమెంటుతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజంట్ నెలకుర్తి వెంకట్రావు గారి వద్ద నుండి ది.26-12-2014న విక్రయ దస్తావేజు నెం.8356/2014 యస్.ఆర్.ఓ. సత్తెనపల్లి ద్వారా రిజిస్టరు కాబడిన, 3)తలశిల నరసింహారావు గారి తరపున విక్రయ ఎగ్రిమెంటుతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజంట్ కొప్పినేని శ్రీనివాస రావు గారి వద్ద నుండి ది.26-12-2014న విక్రయ దస్తావేజు నెం.8357/2014 యస్.ఆర్.ఓ.సత్తెనపల్లి ద్వారా రిజిస్టరు కాబడిన పై మూడు దస్తావేజు నెంబర్లు తాలూకు ఆస్తిని అమ్ముటకు బహిరంగపరచగా నా క్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడియున్నారు.కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అక్షేపణలు తనఖాలు కోర్టుజప్తులు ఇతర క్లయిములు ఏమైనా ఉన్న యెడల 7రోజుల లోపల దిగువ చిరునామాకు తగిన వ్రాతపూర్వక ఆధారాలతో రిజిస్టరు పోస్టు ద్వారా తెలియజేయగలరు. గడువు లోగా ఎట్టి క్లయిములు రాని యెడల నిష్పేచి ఆస్తిగా భావించి నా క్లయింటు సక్రమమైన విక్రయ దస్తావేజు పొందగలరని,తదుపరి వచ్చు అక్షేపణలు నా క్లయింటు హక్కులని గాని, షెడ్యూలు ఆస్తిని గాని బైండుచేయజాలవు.

షెడ్యూలు:పల్నాడు డి.,నరసరావుపేట రి.డి., సత్తెనపల్లి సబ్.డి., మేడికొండూరు మండలం, సిరిపురం గ్రామ పంచాయతీ ఏరియా,సిరిపురంగ్రామ డి.నెం. 220/బి లో య.2-97సెంట్లు భూమి.

కె.యస్.యం. కిషోర్, అడ్వకేట్, బృందావన్ గార్డెన్స్ 3వలైను, గుంటూరు-522006,సెల్:9848570106

### ప్రతి హామీని నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పెదకూరపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బ్రహ్మయ్య మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు అర్తిమల్ల రమేష్, డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, గళ్ళ బాబురావు, గంగినేని లీలావతి, మోదుగుల చంద్రశేఖర్, షేక్ ముంతాజ్, నందిగామ రమేష్, కంచర్ల మార్కు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య

## ఉంగుటూరు-కంభంపాడు రోడ్డు అధ్వానం





గోతుల మయంగా మారిన బీటీ రోడ్డు



బీటీ రోడ్డుపై ప్రమాదభరితంగా ఉన్న గుంత

అమరావతి, జూలై 14(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని అమరావతి, పెదకూరపాడు మండలాలకు చెందిన ఉంగుటూరు, కంభంపాడు గ్రామాల మధ్య ఉన్న బీటీ రహదారి కూటమి ప్రభుత్వం నిర్వహించిన మరమ్మతులకు నోచుకోకపోవడంతో రహదారిపై గుంటలు పడి వాహనదారులను, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉంగుటూరు నుండి కంభంపాడు వెళ్లే మార్గంలో హైలెవల్ వంతెన దాటిన తరువాత రహదారి మార్జిన్ వైపు నాలుగు అడుగుల లోతు గుంట ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించేందుకు పక్కకు వెళితే ఆ గుంట యమపాశం అయ్యే ప్రమాదం ఉంది. అక్కడక్కడ బీటీ రోడ్డు దెబ్బతిని గుంటలు ఏర్పడ్డాయి. అధికారులు ఈ రహదారికి మరమ్మతులు చేయలేదు. ఈ రహదారికి మరమ్మతులు చేయించవలసినదిగా రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### మురళికి సన్మానం

సత్తెనపల్లి జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయ అవార్డుకు ఎంపికైన చేనేత కార్మికుడు కర్నాటి మురళిని సోమవారం ఛత్రపతి కళాపరిషత్ సభ్యులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పులహరి గోవిందు, వెంకోజి, భవానీ ప్రసాద్, యర్ర ఆదినారాయణ, పులహరి భానోజి తదితరులున్నారు.



నడికుడి రైల్వే స్టేషన్ రహదారిలో చేపడుతున్న విస్తరణ పనులు

### వేగంగా రహదారి విస్తరణ పనులు

దాచేపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడి రైల్వే స్టేషన్ రహదారిలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అరకొరగా పనులు చేసి వదిలేసిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోంది. సుమారు 2కి.మీ.ల దూరం ఉన్న రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. సుమారు కోటి రూపాయల నిధులతో పనులు సాగుతున్నాయి.



# అడ్డగోలు.. అనుసంధానం!

- విద్యుత్ సర్వీసు ఒకరిది.. ఆధార్ మరొకరిది
- మీటర్ రీడింగ్ పెరిగితే.. సంక్షేమ పథకాలు కట్.. ● నష్టపోతున్న లబ్ధిదారులు
- పల్నాడులో ఒక సర్వీసు నంబరుకు 150 ఆధార్ లింకులు.. ● పట్టించుకోని విద్యుత్ యంత్రాంగం

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధికంగా విద్యుత్ సర్వీస్ నంబర్లకు అడ్డగోలుగా ఆధార్ కార్డు లింక్‌లు చేయడం వివాదాస్పదంగా మారుతోంది. ఇటీవల పల్నాడులోని వినుకొండలో ఓ వినియోగదారుడి విద్యుత్ సర్వీసుకు ఏకంగా 150 ఆధార్ కార్డులు లింక్ అవడం చర్చనీయాంశంగా మారింది. విద్యుత్ సర్వీస్ నంబర్లకు ఆధార్, ఫోన్ నంబర్లు లింక్ చేయాలన్న నిబంధన పక్కాగా అమలు చేయాల్సి ఉంది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ అసలు సర్వీస్ తీసుకొన్న వినియోగదారుడి ఆధార్ నంబరు కాకుండా.. సంబంధం లేనివారిని లింక్ చేయడమే వివాదాస్పదమవుతోంది. ఒక్కో సర్వీస్ నంబర్‌కు మూడు నుంచి ఐదు, పది ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఆధార్ నంబర్లు అనుసంధానమై.. ఉండటం ఇటీవల వెలుగు చూస్తున్నాయి.

**● ఈ అనుసంధానం వెనుక ఆంతర్యమేమిటో..?**

**మంగళగిరి సెక్షన్ పరిధిలో దొంతిరెడ్డి శివరామిరెడ్డి పేరుతో ఉన్న విజయ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ విద్యుత్ సర్వీస్‌కు మాజీ ఎంపీ నందిగం సురేష్ కుటుంబ సభ్యుల ఆధార్ నంబరు అనుసంధానమై ఉండటం చర్చనీయాంశంగా మారింది. అలాగే దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**

### సంక్షేమ పథకాలకు ఎసరు..

సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారుల విద్యుత్ మీటర్ రీడింగ్‌ను కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటోంది. ఏడాదిలో సరాసరి 3,600 యూనిట్లు దాటి వినియోగం జరిగితే వారికి పలు పథకాలు వర్తించే పరిస్థితి లేదన్నట్లు అధికారులు చెబుతున్నారు. సర్వీసుకు వేర్వేరు ఆధార్ నంబర్లు అనుసంధానమై.. అనేక మంది లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఇటీవల విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌లకు వేరొకరి ఆధార్ నంబర్లు అనుసంధానం కావడంతో.. తల్లికి వందనం పథకం లబ్ధికి అర్హులు దూరమైన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యుత్ శాఖ ఈఆర్వో కార్యాలయాలకు లబ్ధిదారులు పరుగులు పెట్టారు. అయితే విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం.. 'మాకు సంబంధం లేదు అనుసంధానమైన.. సర్వీస్ వినియోగదారుల ఆధార్ కార్డులు మీరే తీసుకురండి' అం టూ తీరిగ్గా, ఉచిత సలహాలు ఇస్తున్నారు.

### పట్టించుకోని యంత్రాంగం

విద్యుత్ సర్వీస్ నంబర్లకు అడ్డగోలు ఆధార్ కార్డులు, ఫోన్ నంబర్ల లింక్‌లపై విద్యుత్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఉదాసీనత, క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంతో అడ్డగోలుగా ఆధార్ నంబర్లు అనుసంధానం అయ్యాయన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు.. క్షేత్రస్థాయిలో సిబ్బంది సాయంతో విద్యుత్ సర్వీస్‌లకు అడ్డగోలుగా ఉన్న ఆధార్ కార్డులను తొలగించి సక్రమంగా నిర్వహించాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మన మిత్రతో.. అన్నదాత సుఖీభవ




- అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేదా..?
- ఆందోళన అవసరం లేదు.. మన మిత్ర ఉంది..
- వాట్సాప్ నంబరుకు హాయ్ పెడితే చాలు..
- ఎందుకు అనర్హులయ్యారో వెంటనే సమాచారం
- రైతులకు రియల్ టైమ్ గవర్నెన్స్: డీఏఓ నాగేశ్వరరావు





గుంటూరు సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోతే కారణం తెలుసు కోవడం అతి సులభమని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చే రూ.6వేలతో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇవ్వడం జరుగుతుంది. రైతు సేవా కేంద్రాల్లో అర్హుల జాబితా ఇప్పటికే ప్రదర్శించారు. రైతులు వాటిని పరిశీలించి తమ పేరు ఉందో లేదో చూసు కోవాలి. అర్హత ఉండి.. జాబితాలో తమ పేరు లేకపోతే.. ఖంగారు పడకుండా.. అందుకుగల కారణాన్ని వెంటనే తెలుసుకోవచ్చు. ఇందుకు చేయాల్సిందల్లా.. రాష్ట్ర ప్రభుత్వం రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా తీసుకొచ్చిన మన మిత్ర వాట్సాప్ నంబరు హాయ్ పెడితే చాలు.

### గుంటూరు జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 2,64,566 మంది రైతులు ఉండగా 2,21,317 మంది రైతులకు ఈ-కేవైసీ పూర్తయింది. మిగి లిన రైతులకు వివిధ కారణాలతో ఈకేవైసీ కాలేదు. వివరాలకు వ్యవసాయ అధికారి టెక్నికల్ నంబర్ 83310 56914కు కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

### ప్రధానంగా ఎదురయ్యే సమస్యలు..

- భూమి లేని బీసీ, ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు, కౌలు గుర్తింపు కార్డులు పొందాలి. ఖరీఫ్ పంటల వివరాలు నమోదు చేసుకోవాలి. అర్హులకు రూ.20 వేలు సాయాన్ని మూడు విడతల్లో అందజేస్తారు.
- డి-పట్టాదారులు, అసైన్డ్, ఈనాం భూములు సాగు చేసేవారందరూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులే. కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. కుటుంబం నుంచి విడిపోయి వేరుగా ఉంటే.. కుటుంబ సర్వేలో వేరు చేయించుకోవాలి.
- వెబ్ ల్యాండ్‌లో రైతు ఆధార్ నంబరు తప్పుగా అనుసంధానం చేసి ఉంటే రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి సరైన ఆధార్ నంబరును అనుసంధానం చేయించుకోవాలి.
- వెబ్ ల్యాండ్‌లో ఆధార్‌తో జత కాలేదని గుర్తించినా.. చనిపోయిన వారి భూమి మ్యుటేషన్ జరగకపోయినా, వెబ్ ల్యాండ్‌కు సంబంధించిన కారణాలు ఏమైనా ఉంటే వీఆర్వో, తహసీల్దారు ద్వారా సరిచేసుకోవాలి. అనంతరం రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి.
- అటవీ భూమి సాగుదారులు.. గిరి భూమి పోర్టల్లో సమస్యలు ఉంటే గిరిజన సంక్షేమ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి, ఆధార్ తప్పుగా నమోదైనా మ్యుటేషన్ కోసం పీఓను సంప్రదించి సరిచేసుకోవాలి.
- రైతుల పేర్లు పరిశీలనలోకి రాలేదంటే వారి భూమి రెవెన్యూ వెబ్ ల్యాండ్, ఆధార్ జతకాలేదని గుర్తించాలి. రెవెన్యూ అధికారిని సంప్రదించి ఆధార్‌ను వెబ్ ల్యాండ్ రికార్డులతో అనుసంధానం చేసుకుని అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. దేవాదాయ భూముల్లో సాగు చేస్తున్న వారిని కౌలు రైతుల కింద గుర్తించి పెట్టుబడి సాయం అందిస్తారు.

### ఏం చేయాలి..

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో పేరు లేని రైతులు మన మిత్ర (95523 00009) వాట్సాప్ నంబరుకు తమ ఫోన్ నుంచి హాయ్ అని సందేశం పంపాలి. అందులో మొదటి వరసలో ఉండే అన్నదాత సుఖీభవ సేవపై క్లిక్ చేసి ఆధార్ నం బర్ నమోదు చేయాలి. దీంతో వెంటనే లబ్ధిదారుని పేరు, తండ్రి పేరు, గ్రామం, మండలం మొదలగు సమాచారం వస్తుంది. అందులో పథకానికి అర్హులా, అనర్హులా అని కూడా తెలుస్తుంది. అనర్హులైతే.. అందుకు కారణం కూడా పొందు పరచడం జరుగుతుంది. ఈకేవైసీ పూర్తయిందా లేదా అనే వివరాలు కూడా వస్తాయి. కారణం తెలుసుకొని అవసరం అయిన పత్రాలు అందజేస్తే వ్యవసాయ శాఖ సిబ్బంది సమస్యను వెంటనే పరిష్కరిస్తారు.

## హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయికి విజయలక్ష్మి అవార్డు



తెనాలి అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు న్యాయమూర్తి వెంకటజ్యోతిర్మయి ప్రతాపను విశ్రాంత దివంగత ఉపాధ్యాయిని మొవ్వా విజయలక్ష్మీ స్మారక అవార్డుతో సత్కరించనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మొవ్వా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏడేళ్లగా ఈ అవార్డును ప్ర ముఖులకు అందజేస్తున్నారు. విజయలక్ష్మి పేరిట సత్యనారాయణ పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఈ నెల 19న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పదవ తరగతిలో 550కి పైగా మార్కులు సాధించిన 60 మందికి ఒక్కొక్కరికి రూ.ఐదు వేలు చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ ఏడాది పురస్కారాన్ని గౌరవ న్యాయమూర్తికి ప్రదానం చేస్తారు. విద్యార్థులు-భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై ఆమె స్మారకోపన్యాసం చేస్తారు. తెనాలిలో జన్మించిన జస్టిస్ జ్యోతిర్మయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. పలుమార్లు బంగారు పతకాలు అందుకున్నారు. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. 1997లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు అయి అంచలంచలుగా హైకోర్టు న్యాయమూర్తిగా ఎదిగారు. జాతీయ న్యాయ సేవా సంస్థకు థీమ్ సాంగ్‌ను కూడా రచించారు. సైబర్ క్రైమ్‌పై శిక్షకురాలిగా పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె సేవలను గుర్తించిన విజయలక్ష్మి స్మారక సేవా సంస్థ ఈ అవార్డును ఎంపిక చేసిందని సత్యనారాయణ తెలిపారు. అవార్డు ప్రదానోత్సవంలో జేఎన్‌టీయూ కాకినాడ వీసీ శివరామకృష్ణప్రసాద్, దళిత యూనివర్శిటీ వీసీ గుజ్జర్లమూడి కృపాచారి, డీఎస్పీ జనార్దనరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఏఎస్ఎన్ ప్రిన్సిపల్ రాంచంద్ పాల్గొంటారని తెలిపారు.

## రూ. 60.17 లక్షల విత్తన అమ్మకాలు నిలిపివేత

● గుంటూరులో విజిలెన్స్ దాడులు

గుంటూరు సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీదారులు, టోకు వర్తకులు, రిటైల్ డీలర్ల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. రెండు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 60.17 లక్షల విలువైన మిరప, సోయాబీన్ విత్తనాల అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశించారు. అదేవిధంగా రూ. 1.66 లక్షలు విలువ చేసే ఎరువులు, రూ. 14.13 లక్షల విలువ చేసే 3,460 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు వెల్లడించారు. సరైన పత్రాలు లేనందున అమ్మకాలు నిలిపి వేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఏడీఏ పి.మురళీ కృష్ణ, క్రిష్ణా జిల్లా ఏడీ ఏఎం సునీల్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు కె.వెంకటేశ్వర్లు, సీహెచ్ రవిబాబు, గుంటూరు రూరల్ వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్ కుమార్ పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

## తత్కాల్ బుకింగ్‌కి.. ఓటీపీ!




**ఏజెంట్ల మాయా జాలం**

తత్కాల్ టిక్కెట్‌లు రైల్వేలో హాట్ కేకుల్లా బుకింగ్ అయిపోతుంటాయి. ఇందుకు ప్రధాన కారణం లైసెన్సు కలిగిన ఏజెంట్లు, కొంతమంది ఇంటర్‌నెట్ సెంటర్ల నిర్వాహకులు ఎవరెవరివో ఈ-మెయిల్స్, మొబైల్ నంబర్ల ద్వారా యూజర్ ఐడీలు నమోదు చేసి, ఎక్కువ స్పీడ్ కలిగిన ఇంటర్నెట్ సదుపాయంతో టిక్కెట్‌లు బుకింగ్ చేస్తుంటారు. దీంతో ఐఆర్‌సీటీసీ యూజర్లతో పాటు పీఆర్ఎస్ కౌంటర్లలో బుకింగ్ చేసుకోవడానికి వెళ్లిన సామాన్యులకు తత్కాల్ వెయిటింగ్ లిస్టు ప్రత్యక్షమవుతుంది. తత్కాల్ అవుతుండగానే ప్రీమియం తత్కాల్ టిక్కెట్లను కూడా బుకింగ్ చేస్తున్నారు. దీనిపై రైల్వే శాఖకు కొన్నేళ్లుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

- రిజర్వేషన్‌కు ప్రామాణీకరణ తప్పనిసరి
- నేటి నుంచే పీఆర్ఎస్ కౌంటర్లు, ఐఆర్‌సీటీలో అమలు
- ఏజంట్లకు అరగంట తర్వాతే బుకింగ్ అనుమతి
- ఆపరేషన్ ఉపలబ్ధ్ పేరుతో ఆర్‌పీఎఫ్ నిఘా



గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైల్వే తత్కాల్ టిక్కెట్ల బుకింగ్‌లో ఆ శాఖ చేసిన సవరణలు మంగళవారం నుంచి అమలులోకి రానున్నాయి. ఐఆర్‌సీటీసీ యాప్, లైసెన్సు కలిగిన ఏజంట్లు, ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం(పీఆర్ఎస్) కౌంటర్లలో తత్కాల్ టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవాలంటే సమర్పించిన మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీని ప్రామాణీకరణ తప్పనిసరిగా చేయాలి. అప్పుడే టిక్కెట్ రిజర్వు అవుతుంది. దీని వల్ల టిక్కెట్ బుకింగ్‌కు కొంత సమయం పెరిగే అవకాశం ఉంది. ఐఆర్‌సీటీసీ యాప్ /వెబ్‌పోర్టల్ వినియోగదారులైతే ఆధార్ ఆధారిత ఓటీపీని నమోదు చేస్తేనే టిక్కెట్ బుకింగ్ అవుతుంది. లైసెన్సు కలిగిన ఏజంట్లు తత్కాల్ బుకింగ్స్ ప్రారంభమైన అరగంట వరకు లాగిన్ చేసుకోలేరు. ఈ క్రమంలో ఏమైనా అడ్డదారులు తొక్కేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు చేపట్టేందుకు ఆర్‌పీఎఫ్ ఆపరేషన్ ఉపలబ్ధ్ పేరుతో ఆకస్మిక దాడులకు ఉపక్రమించింది.

### ఓటీపీ నమోదు తప్పనిసరి

ఎట్టకేలకు రైల్వే శాఖ తత్కాల్ స్కీమ్‌లో కొన్ని మార్పులు చేసి నేటి నుంచి అమలులోకి తీసుకురానుంది. ఇప్పటికే ఐఆర్‌సీటీసీ యాప్ వినియోగించే యూజర్లకు ఆధార్‌తో అథెంటికేషన్ చేయించింది. ఆధార్ అథెంటికేషన్ లేకపోతే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవడానికి అవకాశం లేకుండా చేసింది. తాజాగా యాప్/ పోర్టల్ ద్వారా టిక్కెట్‌లు బుకింగ్ చేయదలిచిన యూజర్లు ఆధార్ ఆధారిత ఓటీపీని అథెంటికేషన్ చేస్తేనే తత్కాల్ టిక్కెట్ బుకింగ్ జరుగుతుంది. పీఆర్ఎస్ కౌంటర్లకు వెళ్లి ఫాంలు నింపి బుకింగ్ చేసుకొనే ప్రయాణికులు అందులో తప్పనిసరిగా మొబైల్ నంబరుని నమోదు చేయాలి. ఆ నంబరుకు వచ్చే ఓటీపీని బుకింగ్ క్లర్కుకు చెబితేనే టిక్కెట్ బుకింగ్ జరుగుతుంది. లైసెన్సు పొందిన ఏజంట్లు ఏసీ తరగతుల టిక్కెట్‌లు అయితే ఉదయం 10.30, నాన్ ఏసీ తరగతుల టిక్కెట్లను 11.30 గంటల నుంచి మాత్రమే బుకింగ్ చేయగలరు. అది కూడా ప్రయాణికుడి మొబైల్ నంబరకు వచ్చే ఓటీపీని ప్రామాణికరణ చేసిన తర్వాతనే. కాగా, గత రెండు రోజుల నుంచి ఆపరేషన్ ఉపలబ్ధ్ పేరుతో ఆర్‌పీఎఫ్ సిబ్బంది గుంటూరు రైల్వే డివిజన్‌లో పలుచోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళగిరిలోని యోహిత డిజీ సర్వీసెస్‌లో తనిఖీలు నిర్వహించి ఐదు లైవ్ ఈ టిక్కెట్‌లు, 39 వినియోగించిన ఈ-టిక్కెట్లను సీజ్ చేశారు. వీటి విలువ రూ. 76,715గా పేర్కొన్నారు. అలానే మరో రైల్వేస్టేషన్‌లో రెండు లైవ్ టిక్కెట్లను సీజ్ చేశారు. నరసరావుపేటలో ఆపరేషన్ రైల్ ప్రహరీ నిర్వహించి, ఒక నకిలీ టీటీని అరెస్టు చేశారు.

## మంత్రితో మీటింగ్ ఏర్పాటు చేయాలి

**ఏపీ ఎంసీప రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్**

గుంటూరు సిటీ, జూలై 14( ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న పది వేల మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలపై చర్చించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. తమ హక్కుల సాధన కోసం 40 రోజుల పాటు సమ్మె చేస్తే వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులు కొన్ని హామీలు ఇచ్చి దాన్ని విరమింపజేశారని పేర్కొన్నారు. అందులో ప్రధానమైన హామీ ఆరోగ్య శాఖ మంత్రితో సమావేశం ఏర్పాటు అని గుర్తుచేశారు. సమ్మె విరమించి మూడు నెలలు దాటినా అధికారులు సమావేశం ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా.. మంత్రితో సమావేశం ఏర్పాటు చేసి, పెండింగ్ ప్రోత్సాహకాలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రోత్సాహకాలు రాకపోవడంతో పిల్లలకు పాఠశాల ఫీజులు కూడా చెల్లించలేక పోతున్నామని ఏపీ ఎంసీప రాష్ట్ర కార్యదర్శి బీరు సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను టాటా డీఐఎన్‌సీ ప్రైవేట్ కంపెనీకి కేటాయిస్తామని చెప్పడం కూడా ఆందోళన కలిగిస్తోందన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ గురించి మొదట తమతో మాట్లాడాలన్నారు. ఈ అనుమానాల నివృత్తి కోసం మంత్రితో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

## సీఆర్డీఏ ఆధీనంలోకి ఇసుక క్వారీలు..!

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నగరంలో నిర్మాణ పనులు ఊపందుకోవడంతో ఇసుక కొరత రాకుండా ఉండేందుకు మున్సిపల్ పరిపాలన శాఖ ముందుచూపు చర్యలు చేపట్టింది. కృష్ణానది తీరం వెంట ఇరువైపులా ఉన్న ఇసుక రీచ్‌లన్నింటిని ఏపీ సీఆర్‌డీఏ ఆధీనంలోకి తీసుకొనేందుకు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేయగా .. పురపాలక శాఖ దానికి రాజముద్ర వేసింది. దాదాపుగా రూ.286 కోట్ల అంచనా విలువతో ఏజెన్సీని త్వరలో ఎంపిక చేసి ఇసుకని బయటకు తీసే బాధ్యతని కేటాయించనుంది. ఇందుకోసం అవసరమైన అన్ని అనుమతులను ఏపీ సీఆర్‌డీఏ తీసుకొనేలా నిబంధనల్లో సవరణలు కూడా జరిగాయి.

● రాజధాని అవసరాలకు ఇబ్బంది లేకుండా చర్యలు




దీంతో ఇసుక రేవులన్ని కొద్ది రోజుల్లోనే సీఆర్‌డీఏ ఆధీనంలోకి వెళ్లిపోనున్నాయి. నదిలో నుంచి తీసిన ఇసుక మోతాదు, విక్రయించగా వచ్చిన నగదుని జిల్లా స్థాయి ఇసుక కమిటీ పర్యవేక్షిస్తుంది.

### భారీ మోతాదులో ఇసుక అవసరాలు

సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ ద్వారా రాజధానిలో వివిధ నిర్మాణాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏడీసీఎల్‌కి 67,88,355 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని ఇది వరకే ప్రభుత్వానికి తెలియజేసింది. అలానే ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద మౌలిక సదుపాయాల కల్పన కసం 1,18,69,500 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం. హౌసింగ్, భవనాలకు 11,77,815 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఇసుక రీచ్‌లలో నుంచి ఇంత భారీ మోతాదులో ఇసుక సరఫరా చేయాలంటే కుదిరే పని కాదు. ఇదే విషయాన్ని జిల్లా స్థాయి ఇసుక కమిటీ ప్రభుత్వానికి నివేదించింది.

**పూడికతీత.. బ్యారేజ్‌లో నీటి నిల్వ**

రెండు జిల్లాల్లో ఉన్న ఇసుక రీచ్‌లలో సీ ఆర్‌డీఏ, ఏడీసీఎల్‌కు అవసరమైనంత మోతా దులో ఇసుక నిల్వలు లేవు. ప్రకాశం బ్యా రేజ్ ఎగువున పూడిక తొలగిస్తే చాలా వరకు అవసరాలు తీరతాయి. ప్రకాశం బ్యారేజ్‌లో ఎన్నో సంవత్సరాలుగా ఇసుక పూడిక తొలగిం పు చేపట్ట లేదు. ఈ కారణంగా వరదలు వచ్చిన ప్రతి సారి భారీ మోతాదులో ఇసుక వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజ్‌లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపో తోంది. మరోవైపు ద్వీపాలు కూడా విస్తరి స్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవి ష్యత్తులో మరిన్ని సమస్యలు ఉత్పన్న మయ్యే అవకాశం ఉంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొన్న ప్రభుత్వం రాజధాని అవసరాలకు ఇసుక మేటలు, పూడిక తొలగించనుండటంతో నీటి నిల్వ కూడా పెరుగుతుంది.




2018లో కోనంకిలో కరకట్ట ఉన్నట్టు గూగుల్ చిత్రం (సర్కిల్‌లో)

## కోనంకి మట్టిపై కాసు కట్టుకథలు

● తొవ్వింది వాళ్లే.. టీడీపీపై అభియోగం ● అసలు సంగతి చెప్పిన గూగుల్ ఫొటోలు

పిడుగురాళ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోనంకి గ్రామంలో టీడీపీ నాయకులు మట్టిని అక్రమంగా తరలించేశారని.. వరద ముంపు వస్తే గ్రామం మునకేస్తుందని టీడీపీ నేతల అవినీతికి పాల్పడ్డారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై స్పందించిన టీడీపీ నేతలు, రెవెన్యూ అధికారులు గూగుల్ టేకోవర్ ద్వారా 2018 నుంచి ఇప్పటి వరకు ఉన్న స్థితిని బయటకు తీశారు. 2018లో మట్టికట్ట ఉన్నట్టు గూగుల్ చిత్రంలో చూపిస్తుండగా 2022లో మట్టికట్ట లేనట్టుగా గూగుల్ చిత్రంలో కనిపిస్తోంది. వైసీపీ హయాంలో గ్రామ నాయకు లు మట్టికట్టను అక్రమంగా తొవ్వేసి రహదారి ని ర్మాణానికి లక్షల రూపా యలకు అమ్మేసి... టీడీపీ నేతలపై చేస్తున్న ఆరోపణ లు సరైనవి కావని గూగుల్ చిత్రం ద్వారా స్పష్టంగా తెలుస్తోంది.

2022లో గ్రామంలో కరకట్ట లేనట్టుగా చూపుతున్న గూగుల్ చిత్రం



### తల్లికి వందనం అర్హుల పేర్లు ఆన్‌లైన్ చేయాలి: ఛైర్మన్ ఆదేశం

చిలకలూరిపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్, ఎడ్యుకేషన్ సెక్రటరీస్, వీఆర్వోలు, మెప్మా సిబ్బందితో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం జరిగింది. ప్రధానంగా తల్లికి వందనం పథకానికి సంబంధించి పట్టణంలో అర్హత కలిగిన రెండు రోజులలో విచారణ జరిపి గుర్తించిన వారందరి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారుల అర్హత నిర్ధారణకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని కోరారు. మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు పాల్గొన్నారు.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



### సొసైటీ అధ్యక్షులకు, సభ్యులకు జీవీ అభినందనలు

వినుకొండ టౌన్, జూలై 14, (ఆంధ్రజ్యోతి) వినుకొండ నియోజకవర్గంలోని పలు సొసైటీలకు అధ్యక్షులను, సభ్యుల వివరాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. నూతనంగా ఎంపికైన అధ్యక్షులకు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అభినందనలు తెలిపారు. వినుకొండ సొసైటీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, సభ్యుడిగా వజ్రాల రామకృష్ణారెడ్డి, గణపా శ్రీను, నూజండ్ల సొసైటీ అధ్యక్షుడిగా బచ్చు ఆంజనేయరెడ్డి, సభ్యులు గంగినేని బ్రహ్మయ్య, యేసు సమాధి, గుర్రప్పనాయుడుపాలెం సొసైటీ అధ్యక్షుడిగా ముంద్రు సుబ్బారావు, సభ్యులుగా రాయల శ్రీకాంత్, కొత్త పరబ్రహ్మారెడ్డి, కారుమంచి సొసైటీ అధ్యక్షుడిగా గోపాలం శివప్రసాద్, సభ్యుడిగా గద్దె వీరమస్తాన్‌రావు, దారా రాయుడు, శావల్యాపురం సొసైటీ అధ్యక్షుడిగా గడిపూడి విశ్వనాథం, సభ్యులుగా గోనుగుంట్ల నాగరాజు, ఓడరేవు వీరాంజనేయులు లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

### పాఠశాలకు కుర్చీల బహూకరణ

రొంపిచర్ల: మండలంలోని కర్లకుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మాజీ సర్పంచ్ మందలపు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం కుర్చీలు, విద్యార్థులకు ప్లేట్లు, పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు వడ్లమూడి వెంకటకిషోర్, మాజీ సర్పంచ్ బంధువులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### మహంకాళి అమ్మవారి ఆలయానికి విరాళం

నరసరావుపేట రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయం పునఃనిర్మాణానికి భక్తులు విరాళం అందజేశారు. నరసరావుపేటకు చెందిన దివ్వెల శివశంకర్రావు జ్ఞాపకార్థం భార్య సరస్వతి, కుమారుడు దివ్వెల రామకృష్ణ, త్రిపుర దంపతులు రూ.1,01,116 విరాళంను సోమవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి నలబోతు మాధవిదేవికి అందజేశారు.

### పేద నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థికసాయం

నరసరావుపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఠాగూర్ నాయీ బ్రాహ్మణ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ప్రతిభావంతులైన నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు పురస్కారం, పేద నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సాయం చేయటం జరుగుతుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. దరఖాస్తులను కొడాలి జనార్దన రావు, ఠాగూర్ నాయీ బ్రాహ్మణ ఎడ్యుకేషనల్ సొసైటీ, డోర్ నెంబరు 37-12-2080, ఆదిత్య నగర్ ఫస్ట్ లైన్, రెడ్డిపాలెం పోస్ట్, గుంటూరు-522509, చిరునామాకు ఈ నెల 20లోపు పంపాలన్నారు. అదనపు సమాచారం కోసం 9573381525, 9393138248 నంబర్లను సంప్రదించాలన్నారు.

### వాగ్దేవిలో ముగిసిన శిక్షణ తరగతులు

నరసరావుపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో మహేంద్ర కంపెనీ సహకారంతో నాంది ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. మొత్తం 80మంది విద్యార్థులకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### క్లుప్తంగా...

● శావల్యాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జడ్పీపాఠశాలలో 2001-02 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమేళనాన్ని నిర్వహించారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న చిన్ననాటి స్నేహితులు విజయలక్ష్మి, మాణిక్యాలరావులకు ఒక్కొక్కరికీ రూ.50వేలు చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారు. పాఠశాల అభివృద్ధికి రూ.10వేలు విరాళంగా అందజేశారు.

● చిలకలూరిపేట: పట్టణంలో ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు ఇతర ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తున్న, దుకాణాలపై సోమవారం మునిసిపల్ అధికారులు మెరుపు దాడులు చేశారు. మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరి బాబు ఆధ్వర్యంలో దుకాణాలలో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో లక్షల సంఖ్యలో ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, టీ కప్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

● యడ్లపాడు: ట్రాక్టర్ అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కాలువలోకి దూసుకెళ్లిన ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. యడ్లపాడు మండలం లింగారావుపాలెం వద్ద నక్కవాగుపై నిర్మించిన అక్విడెక్ట్ వద్ద మట్టిలోడు ట్రాక్టర్ అదుపుతప్పి పీబీసీ కెనాల్‌లోకి పల్టీకొట్టింది. డ్రైవర్ పక్కకు దూకేయడంతో ప్రమాదం తప్పింది.

● నాదెండ్ల: మండలంలోని నాదెండ్ల, గణపవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీలను ఏర్పాటుచేస్తూ అధికారులు ఆదేశాలు జారీచేశారు. నాదెండ్ల సహకార సంఘంకు ఛైర్‌పర్సన్‌గా నల్లమోతు హరిబాబు, సభ్యులుగా బత్తుల లక్ష్మారెడ్డి, చట్టాల చెంచుఆంజనేయులు నియమితులయ్యారు. గణపవరం సంఘం ఛైర్‌పర్సన్‌గా పి.శేషయ్య, సభ్యులుగా యామిని ధర్మారావు, పూర్ణే హనుమంతరావులను నియమించారు.

## దూరవిద్యా విధానంను సద్వినియోగం చేసుకోండి

● జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

నరసరావుపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల వల్ల మధ్యలో చదువు మానేసినవారు దూరవిద్యా విధానంను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శంకరభారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్స్ డ్రైవ్ 2025-26 విద్యా సంవత్సరానికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. సంబంధిత ఉప విద్యాశాఖాధికారులకు ఏఐ కో ఆర్డినేటర్లు, మండల విద్యాఖాధికారి-2లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరంలో దూరవిద్యా విధానంలో పదో తరగతి, ఇంటర్ పూర్తిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించిందన్నారు. ఓపెన్‌స్కూల్ పరీక్షల ద్వారా విద్యార్థులు పొందే ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెగ్యులర్ విద్యార్థులతో పాటు సమానమైన గుర్తింపు ఉందన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీనాటికి 14సంవత్సరాలు వయసు నిండి ఉండాలని అన్నారు. చదవడం, రాయడం తెలిసి ఉండాలని, ఏదో ఒక తరతగతి టీసీ, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఉండాలన్నారు. అదేవిధంగా ఇంటర్ ప్రవేశానికి 10వ తరగతి మార్కుల జాబితా, పదో తరగతి టీసీని దరఖాస్తుతో పాటు బ్యాంకు ఖాతా అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు, వికలత్వం అర్హత ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలని సూచించారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా జూలై 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, రూ.200లు అపరాధ రుసుంతో ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గత అభ్యర్థులు మీ సేవ, ఏపీ ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

# ఘనంగా జీవీ ఆంజనేయులు జన్మదినం

● పెద్దసంఖ్యలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు
● కంటి వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు


125 కిలోల కేక్‌ను కట్ చేస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు జిల్లా, రాష్ట్ర నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని జీవీ ఆంజనేయులుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేదపండితులు, అర్చకులు జీవీ ఆంజనేయులు దంపతులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యకర్తలు తీసుకొచ్చిన కేక్‌లను కట్‌చేసి పంపిణీ చేశారు. ముందుగా పట్టణంలోని పాత శివాలయంలో జీవీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని జీవీకి జ్ఞాపికను అందజేశారు. అనంతరం పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కేక్‌ను కట్‌చేసి అందరికీ పంపిణీచేశారు. ఉద్యోగ సంఘ నాయకులు, వివిధ వ్యాపార సంస్థల యూనియన్ నాయకులు, మహిళలు, యువత, ఎన్‌డీఏ కూటమి నాయకులు జీవీ ఆంజనేయులును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజాసేవ చేయడానికి తనకు అవకాశం ఇచ్చిన దేవుడికి, ప్రజలకు ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటానని, ప్రజల ఆశీస్సులు, ఆదరణే తనకు బలమని చెప్పారు. సామాన్య రైతు కుటుంబం నుంచి ఈ స్థాయికి ఎదిగి అటు వ్యాపార విజయాలతో పాటు ఇటు ప్రజాసేవలో పాలు పంచుకునే అవకాశం తనకు లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు.

### జీవీ జన్మదినం సందర్భంగా కంటి వైద్యశిబిరం

జీవీ ఆంజనేయులు జన్మదినాన్ని పురస్కరించుకొని నరసరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి ప్రారంభించారు. సుమారు 500మందికి పైగా శిబిరంలో పాల్గొన్న రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు శంకర్ కంటి వైద్యశాల వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో జీవీ మాట్లాడుతూ ఒక మంచి సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, పది మందికి సేవ చేయడంలో ఉన్న సంతృప్తి మరి ఎక్కడా రాదన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 10లక్షల కోట్లు పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయని, దీంతో 8.50లక్షల మందికి ఉద్యోగాలు సృష్టిస్తున్నట్లు తెలిపారు.


కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీధర్, పక్కన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు,


చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు కేక్ తినిపిస్తున్న చిన్నారి

### కష్టాలకు ఎదురీది ఎదిగిన నాయకుడు జీవీ: కొమ్మాలపాటి శ్రీధర్

జీవీ ఆంజనేయులు చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలను ఎదురీది మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న గొప్ప నాయకుడని కొనియాడారు. శివశక్తి ఫౌండేషన్ నడిపిస్తున్న సేవా కార్యక్రమాలు గుంటూరు జిల్లాలోనే మంచి మార్పుకు నాంది పలుకుతున్నాయన్నారు. వేల మందికి కంటి చూపు ఇవ్వడం ఎంతో గొప్ప పని అని కొనియాడారు.

### ప్రజల కోసమే పరితపిస్తుంటాం ..

శివశక్తి లీలా ఫౌండేషన్ ఛైర్మన్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి మాట్లాడుతూ ప్రతి పుట్టిన రోజు పండుగను వినుకొండ ప్రజల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉంటుందన్నారు. ఫౌండేషన్ ద్వారా జీవీ ఎప్పుడూ ప్రజల కోసమే పరితపిస్తుంటారని, చదువుకోలేని విద్యార్థులకు సాయం, పేదలకు వైద్యం, ప్రకృతి పరిరక్షణ కోసం మొక్కల పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాల్లో ముందుండటం మా బాధ్యతగా భావిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ4 లక్ష్యాన్ని శివశక్తి ఫౌండేషన్ ముందుండి ప్రజల్లోకి తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### 125 కిలోలతో కేక్

వినుకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా శావల్యాపురం మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు గడిపూడి విశ్వనాథం, బీజేపీ నాయకుడు యార్లగడ్డ లెనిన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన 125కిలోల కేక్‌ను జీవీతో కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, నాయకులు మస్తాన్‌రావు, హనుమంతరావు, నాగేశ్వరరావు, ఫరీద్, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, జీవీ రమణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు రోశయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక సీతయ్యనగర్‌లో కూటమి నాయకులు జీవీ ఆంజనేయులు 60వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను ఏర్పాటుచేసి కార్యకర్తలకు, నాయకులకు పంపిణీ చేశారు. అనంతరం వార్డులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి వల్లూరి మురళీకృష్ణ, అధ్యక్షుడు ఏకో నారాయణ, ఆదిరాములు, జనసేన నాయకులు వీరప్రసాద్, సిద్ది అనిల్‌కుమార్ అడపాల కిరణ్, దూదేకుల హుస్సేన్ పీరా, ఏకో శ్రీనివాసరావు, నిశ్శంకర ప్రసాద్, సాయితో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. జీవన్‌జ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జీవీ ఆంజనేయులు పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ హాస్పటల్‌లోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట్రావు, సురభి, దేవసహాయం, నాగేశ్వరరావు, మధు, కోటి తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ హైస్కూల్‌లో ఆర్వో ప్లాంటు ఏర్పాటు


యడ్లపాడు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన ఆర్వోప్లాంటును ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

యడ్లపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇకపై స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. నాడు-నేడులో భాగంగా పాఠశాలకు ఆర్వో ప్లాంటు మంజూరు కాగా దానిని పాఠశాలలో బిగించేందుకు అవసరమైన రూ.10వేలు యడ్లపాడు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అందించారు. ప్లాంటు అమరిక పూర్తికావడంతో సోమవారం కమిటీ సభ్యుల చేతుల మీదుగా ప్రారంభింపచేశారు. కమిటీ సభ్యులు ఆలోకం పెదబ్బయ్య, ముత్తవరపు రామారావు, ఎన్.కాళిదాసులు కార్యక్రమానికి హాజరై ప్లాంటును ప్రారంభించారు. అంతేగాకుండా గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.5వేలు, బాలికల జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి రూ.5వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కాగా టీడీపీ నాయకుడు పోపూరి రాఘవయ్య కూడా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10వేలు నగదు ప్రోత్సాహాన్ని అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభారతి, ఎస్‌ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీకి కృతజ్ఞతలు తెలుపుతున్న విశ్వనాథం

## రెండు సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

శావల్యాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శావల్యాపురం, కారుమంచి సొసైటీల పాలకవర్గానికి సంబంధించిన త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులను జారీచేసినట్లు సొసైటీ సీఈవోలు జాలాది నాగప్రసాద్, యేరువ వెంకటనారాయణలు తెలిపారు. సీఈవోలు మాట్లాడుతూ శావల్యాపురం సొసైటీ అధ్యక్షుడిగా గడిపూడి విశ్వనాథం, సభ్యులుగా గోనుగుంట్ల నాగరాజు, బండారి నాగరాజులను నియమించినట్లు తెలిపారు. కారుమంచి సొసైటీ అధ్యక్షుడిగా గోపాలం శివప్రసాద్, సభ్యుడిగా గద్దె వీరమస్తాన్‌రావు, దారా రామకోటమ్మలను నియమించినట్లు తెలిపారు. నూతన సొసైటీ ఛైర్మన్‌లు గడిపూడి విశ్వనాథం, గోపాలం శివప్రసాద్‌లు, సభ్యులు వినుకొండలోని ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును కలిసి తమ నియామకానికి సహకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## పోగొట్టుకున్న బ్యాగు, సెల్‌ఫోన్‌ల రికవరీ

● గంటల వ్యవధిలో బాధితులకు అప్పగింత


పోగొట్టుకున్న ఫోన్, బ్యాగును ఉపాధ్యాయుడికి అందజేస్తున్న ఎస్ఐ శివరామకృష్ణ

యడ్లపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు, బ్యాగును పోలీసులు గంటల వ్యవధిలో రికవరీచేసి బాధితులకు అప్పగించారు. రెండు వేర్వేరు సంఘటనలకు సంబంధించి ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా పర్చూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆదివారం సాయంత్రం కొండవీడుకోట సందర్శనకు వచ్చాడు. సుమారు 7గంటల సమయంలో తిరుగు ప్రయాణమైన ఆయన సెల్‌ఫోన్, వెంట తెచ్చుకున్న బ్యాగు కనిపించలేదు. సుమారు 9గంటల సమయంలో యడ్లపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్పందించిన ఎస్ఐ హెడ్‌క్వార్టర్స్‌ను సంప్రదించి మొబైల్ లొకేషన్ సాయంతో కొండవీడు సమీపంలోని ఓ అరటి తోటలో ఉన్నట్లు గుర్తించారు. బ్యాగును, సెల్‌ఫోన్‌ను రికవరీచేసి ఫిర్యాదుచేసిన గంట వ్యవధిలో శ్రీనివాసరావుకు అప్పగించారు. కాగా సోమవారం జరిగిన మరో సంఘటనలో తిమ్మాపురం గ్రామానికి చెందిన హార్టీకల్చర్ అసిస్టెంట్ షేక్ ఆయేషా మధ్యాహ్నం 12గంటల సమయంలో సెల్‌ఫోన్ పోయినట్లు ఫిర్యాదు చేసింది. హెడ్‌క్వార్టర్స్‌ను సంప్రదించి వారి సాయంతో ఫోన్ లొకేషన్‌ను 30నిముషాల వ్యవధిలో ట్రేస్‌చేసి బాధితురాలికి అప్పగించారు. రెండు సంఘటనలలో పోలీసులు సత్వరమే స్పందించి నిముషాల వ్యవధిలో ఫోన్‌లు రికవరీచేసి అప్పగించడంపై బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

### రైతులకు మేలు చేస్తున్న కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే అరవిందబాబు

రొంపిచర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలుచేసే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన రొంపిచర్ల మార్కెట్ యార్డులో రైతులకు డ్రోన్ పరికరాన్ని ఆయన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి అందజేశారు. అనంతరం విత్తనాలను రైతులకు అందజేశారు.

### వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

నరసరావుపేట రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలలో సోమవారం వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. రికార్డులలో నమోదుచేసిన వివరాలు, దుకాణాలలో నిల్వల వ్యత్యాసం పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశాలమేరకు అంతర జిల్లా అధికారుల కమిటీ సోమవారం నరసరావుపేట సబ్ డివిజన్లోని నరసరావుపేట చిలకలూరిపేట నాదెండ్ల మండలాలలోని ఎరువులు, పురుగు మందులు విత్తన దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో కేవీ శ్రీనివాసరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు ఐ శాంతి, సీహెచ్ సరిత, టి.శ్రీలత పాల్గొన్నారు.

## దోపిడీదార్లకు మద్దతిస్తే మరింత నష్టం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


తూబాడులో సీసీ రోడ్డు శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పుల్లారావు

నాదెండ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి గురించి ఆలోచించకుండా దోపిడీదారులకు వంతపాడితే మరింత నష్టం జరుగుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని తూబాడు, జంగాలపల్లి గ్రామాలలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తూబాడు గ్రామంలోని ముస్లిం కాలనీలో రూ.15లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్డు, కాలువల నిర్మాణం, సుమారు రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, నాయకులు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యన్నారాయణ, డి.సాంబశివరావు, వెంకటేశ్వర్లు, సి.నాగేశ్వరరావు, షేక్ యాసిన్, జి.నాగేశ్వరరావు, ఇన్నారెడ్డి, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

### పదవికి వన్నె తెచ్చే గొప్ప వ్యక్తి అశోక్ గజపతి రాజు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ కేంద్రమంత్రి, మాజీ ఎంపీ పూసపాటి అశోక్ గజపతిరాజును గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమించడంపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సమర్థుడైన వ్యక్తిని సరైన స్థానానికి ఎంపిక చేయడం తెలుగుజాతికే గర్వకారణం అని పేర్కొన్నారు.

### అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమిపాలన

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన కొనసాగుతోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వినుకొండ పట్టణంలోని 23వ వార్డు, కోటనాల్బ బజారు, డబ్బాసెంటర్‌లలో జీవీ ఇంటింటికీ పర్యటించి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. 23వ వార్డు కౌన్సిలర్ నన్నేసా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి సంఘీభావం

నరసరావుపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ విభాగంలోని టెక్నికల్, నాన్ టెక్నికల్ వారిని విభజించి వారికి ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా వేతనాలు పెంచాలని వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం రెండోరోజు నరసరావుపేట మున్సిపల్ టెక్నికల్, నాన్‌టెక్నికల్ ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. వారి సమ్మెలకు వైసీపీ నాయకులు సంఘీభావం తెలియజేశారు. ఏపీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ చేస్తున్న సమ్మెకు వైసీపీ తరపున పూర్తి మద్దతు తెలియజేస్తున్నట్లు గోపిరెడ్డి తెలిపారు.

## పులుపుల శివయ్యకు ఘన నివాళి


స్తూపం వద్ద శివయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

వినుకొండ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కార్మిక నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పులుపుల వెంకటశివయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పులుపుల శివయ్య స్తూపానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం కారంపూడి రోడ్డులోని గోగినేని ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజల కోసం కష్టపడి పనిచేసిన గొప్ప నాయకుడు పులుపుల శివయ్య అన్నారు. స్వార్థం లేకుండా పనిచేసి ఎమ్మెల్యేగా మంచి గుర్తింపు సాధించారని, ఉద్యమాలకు వినుకొండ పురిటిగడ్డ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, బూదాల శ్రీను, సంద్రపాటి సైదా, రాము, మహంకాళి సుబ్బారావు, పవన్, లాల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


రోటరీ క్లబ్ అధ్యక్షుడు వైవీ నారాయణను అభినందిస్తున్న జి.లీలావతి, జిల్లా గవర్నర్ ఎస్‌వీ రాంప్రసాద్

### రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

వినుకొండ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కారంపూడి రోడ్డులోని బృందావనం ఫంక్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ నూతనంగా ఎంపికైన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు వై.వి.నారాయణ, సెక్రటరీ ఎం.ఎస్. బాజీ, ట్రెజరర్ పొత్తూరి నవీన్ సుధాకర్‌తో పాటు సభ్యులను రోటరీ గవర్నర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి. రాంప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సతీమణి లీలావతి పాల్గొని నూతనంగా ఎంపికైన రోటరీ క్లబ్ నాయకులు, సభ్యులను అభినందించారు. రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దస్తగిరి సతీమణి షకీలాబేగం, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్, కూచి ఆంజనేయులు, బీజేపీ నాయకుడు లెనిన్, విశ్వనాథం, ల్యాబ్ శ్రీను పాల్గొన్నారు.